పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు



# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 14 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## మొబైల్ ఫోన్ల కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు



### కెసిఆర్‌కు లీగల్ నోటీసులు పంపిన సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 13: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు మంత్రి సీతక్క లీగల్ నోటీసులు పంపించారు. బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా చేస్తున్న తప్పుడు ఆరోపణలకు కేసీఆర్ బాధ్యత వహించాలని నోటీసుల్లో పేర్కొన్నారు. సోమవారం 13న రిజస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీసులు పంపించారు సీతక్క. సీతక్క తరుపు అడ్వకేట్ నాగులూరి కృష్ణ కుమార్ రిజిస్టర్ పోస్టు ద్వారా కేసీఆర్ కు లీగల్ నోటీస్ పంపించారు. అంగన్వాడి మొబైల్ ఫోన్ల కొనుగోలు విషయంలో నిరాధార ఆరోపణలు చేస్తూ తన ప్రతిష్టకు భంగం వాటిల్లేలా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతోందని.. అందుకు కేసీర్ బాద్యత వహించాలనంటూ నోటీసుల్లో పేర్కొన్నారు. అంగన్వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు పక్రియను తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ నిర్వహించిందని తెలిపారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారం కాంట్రాక్ట్ ఇవ్వడం జరిగిందని, ఇందులో తనకు ఎలాంటి సంబంధం లేదని నోటీసులో స్పష్టం చేశారు. మొత్తం టెండర్ విలువ 44 కోట్ల రూపాయలే ఉన్నప్పటికీ, అందులో రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని చెప్పడం అసంబద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేని ఆరోపణగా పేర్కొన్నారు. ఖా పార్టీ అఫీషియల్ సోషల్ మీడియాలో మిగతా 3లో..

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

- ఇరాన్‌పై దాడికి ట్రంప్, ఇజ్రాయిల్ సమాలోచనలు
- ఎప్పుడు ఏం జరుగుతుందో లన్న ఆందోళన



వాషింగ్టన్,ఏప్రిల్13 : అమెరికా-ఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమవడంతో పశ్చిమాసియా మళ్లీ నివురుగప్పిన నిప్పులా మారింది. ఏ క్షణాన ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. మరోవైపు, ఇరాన్‌పై మళ్లీ దాడులు ప్రారంభిం చేందుకు అమెరికా, ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నట్లు వార్తలు రావడం ఆందోళన కలిగిస్తోంది. హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు ఇరాన్‌పై మిగతా 3లో..

## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

- చరిత్రాత్మక చట్టానికి నేటితో ఏడాది పూర్తి
- ఏడాదిలో 5కోట్లకు పైగా భూభారతి పోర్టల్ సందర్శన 70 లక్షల మంది
- పాతసర్వే పద్ధతులకు స్వస్తి-
- ప్రతి సర్వే నెంబర్‌కు భూధార్
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్13 : ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వంలో కుప్పకూలిన రెవెన్యూ వ్యవస్థను గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో పునర్నిర్మిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. భూహక్కుల పరిరక్షణ, పారదర్శకత, అవినీతి రహిత సేవలు సామాన్యుడికి సులభంగా అందేలా గత ఏడాది రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మిగతా 3లో..


## వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు



- 15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ
- తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల

మిగతా 3లో..

## బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం



- ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు

మిగతా 3లో..

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

- ఇందులో బిజెపి రాజకీయ కుట్ర
- పునర్విభజనను రాజకీయ పావుగా వాడుకుంటున్న మోడీ
- జనాభా లెక్కల అనంతరం మహిళా బిల్లు అని చెప్పారు
- ఆ మేరకే గతంలో బిల్లు పెట్టి..ఇప్పుడీ హడావిడి ఎందుకు?
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలపై అనుమానాలు ఉన్నాయి
- 2011 జనాభా లెక్కల ప్రకారం మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలి
- జనాభా లెక్కల తరవాత నియోజకవర్గాల పునర్విభజనపై చర్చించాలి
- దక్షిణాదిని దెబ్బతీసే కుట్రలో భాగంగానే ఉత్తరాది సీట్ల పెంపు
- 50శాతం సీట్ల పెంపు ఏ ప్రాతిపదకనో చెప్పడం లేదు
- మీడియా సమావేశంలో సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం




హైదరాబాద్, ఏప్రిల్ 13: మహిళారిజర్వేషన్లు, పునర్విభజనను కలపడంతో రాజకీయ కుట్ర ఉందని సిఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు.2026 జనాభా లెక్కల ప్రకారం మహిళారిజర్వేషన్లబిల్లు తీసుకువస్తే కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో పాటు కట్టుబడి ఉంటామని ప్రకటిఒచిన విషయాన్ని గుర్తు చేశారు. హిళల రాజకీయ సాధికారితకు కాంగ్రెస్ మొదటి నుంచి కట్టుబడి ఉంది..నియోజకవర్గాల పునర్వభజనను ప్రధాని మోదీ రాజకీయ పావుగా ప్రమాదకరంగా వాడుకుంటున్నాడని ఆరోపించారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం కోసమే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. డీలిమిటేషన్ అనేది రాజకీయ పార్టీలకో, ప్రభుత్వానికో సంబంధించిన అంశం కాదని స్పష్టం చేసిన సీఎం రేవంత్, దీనిని మహిళా రిజర్వేషన్లతో కలిపి చూపించడం సరైంది కాదన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రెండు అంశాలను కలిపి వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోందని విమర్శించారు. సోమవారం సాయంత్రం సచివాల యం లో ఆయన మత్రులు, ఎంపిలు, ఇతర నాయకు లతో కలసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా దుష్ప్రచారం జరుగుతోందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మహిళలకు ఓటుహక్కు, రాజకీయ రిజర్వేషన్లు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందని ఆయన గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలోనే మహిళలు ముఖ్యమైన మిగతా 3లో..



## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

- మినరల్ రంగంలో ఆత్మనిర్భరత భారత్‌పై ప్రత్యేక దృష్టి
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెల్లడి



హైదరాబాద్, ఏప్రిల్ 13: ప్రపంచవ్యాప్తంగా క్రిటికల్ మినరల్స్ ప్రాముఖ్యం పెరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 2047 వికసిత భారత్ లక్ష్యా న్ని సాధించడంలో మినరల్స్ కీలకమని చెప్పుకొచ్చారు. మినరల్ రంగంలో ఆత్మ నిర్భరత సాధించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. సోమవారం హెచ్ఐసీపీలో భారత ప్రభుత్వ గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7వ విడత క్రిటికల్ / స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి కేంద్ర మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ.. జియోపాలిటిక్స్, క్లైమేట్ మార్పు, ఆర్థిక భద్రతలో ఈ మినరల్స్ కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఇప్పటివరకు 46 బ్లాక్స్ వేలం విజయవంతంగా పూర్తి

## గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వలపై దాడులు

- రూ 1.50 కోట్ల విలువైన డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం.
- గత నెల రోజుల్లో 2,089 కేసులు నమోదు.
- పౌరసరఫరాల శాఖ నిరంతర నిఘా



హైదరాబాద్, ఏప్రిల్ 13: గ్యాస్ సరఫరాలో గృహ వినియోగదారులకి ఎటువంటి ఇబ్బంది రాకుండా రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ నిరంతరం మానిటరింగ్ చేస్తున్నది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాలు, నీటి పారుదల మిగతా 3లో..

## ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసు ఢిల్లీ హైకోర్టులో విచారణ

- దర్యాప్తు సంస్థల తీరుపై మండిపడ్డ కేజ్రీవాల్



న్యూఢిల్లీ,ఏప్రిల్13 : ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు విచారణనుంచి జస్టిస్ స్వర్ణకాంత శర్మను తొలగిఒచాలని కోరుతూ ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజీ్రవాల్ హైకోర్టులో పిటిషన్ వేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైకోర్టు పిటిషన్‌పై విచారణ జరిపింది. కేజీ్రవాల్ స్వయంగా తన వాదనలు వినిపించారు. విచారణ పక్రియలో పక్షపాతం ఉండవచ్చంటూ ఆందోళన వ్యక్తం చేశారు. విచారణ సందర్భంగా సాక్షుల వాంగ్మూలాలపై చేసిన వ్యాఖ్యలు తనను దోషిగా, అవినీతిపరుడిగా చిత్రీకరించేలా ఉన్నాయని కేజీ్రవాల్ కోర్టుకు తెలిపారు. దర్యాప్తు సంస్థలపై కూడా కేజీ్రవాల్ సంచలన ఆరోపణలు చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వంటి దర్యాప్తు సంస్థలు మొదట సాక్షులను అరెస్టు చేసి.. ఆ తర్వాత ఇతరులను ఇరికించేలా వారి నుండి బలవంతంగా వాంగ్మూలాలను తీసుకుంటున్నాయని మిగతా 3లో..

## ఓటుకు..నోటుకు లంకె పెట్టినట్లు అనుకున్నారా

- మహిళా బిల్లు, డీలిమిటేషన్‌తో వచ్చే నష్టమేమిటో
- సిఎం వ్యాఖ్యలపై మండిపడ్డ మండి సంజయ్



కరీంనగర్,ఏప్రిల్13 : డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ల బిల్లులతో జరిగే నష్టమేమిటో చెప్పే దమ్ము లేక రాజకీయం చేయాలనుకంటున్నారా అని సిఎం రేవంత్‌రెడ్డిని కేంద్రమంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. డీలిమిటేషన్‌లో భాగంగా ప్రతి ర్యాష్టాని 50 శాతం సీట్ల పెంచితే దక్షిణాదికి జరిగే నష్టమేంటని.. ప్రజల్లో లేనిపోని భయాందోళనలు స్రుష్టించి విభజించాలను కుంటున్నారా అని మిగతా 3లో..

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు

- క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరిక
- భారీ నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు



న్యూఢిల్లీ, ఏప్రిల్ 13 : పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు మొదలు కావడంతో ముడిచమురు ధరలు భగ్గుమన్నాయి. బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 103 డాలర్లకు చేరుకుంది. హోర్ముజ్‌ను దిగ్బంధిస్తామని ట్రంప్ ప్రకటించడం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లు డీలాపడ్డాయి. మరోవైపు డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనమైంది. ఇన్ని వ్యతిరేకతల నేపథ్యంలో సోమవారం సూచీలు నష్టాలతో ప్రారంభమయ్యాయి. నష్టాలతోనే రోజును ముగించాయి. గత సెషన్ ముగింపు (76,794)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు 1600 పాయింట్ల నష్టంతో మొదలైన సెన్సెక్స్ రోజంతా నష్టాల్లోనే కదలాడింది. అయితే ఉదయం భారీ నష్టాలను చవి చూసిన సూచీలు మధ్యాహ్నం తర్వాత కాస్త కోలుకున్నాయి. చివరకు సెన్సెక్స్ 702 పాయింట్ల నష్టంతో 76,847 వద్ద రోజును ముగించింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడింది. చివరకు 207 పాయింట్ల నష్టంతో 23,842 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్, నిఫ్టీలో జేఎస్‌డబ్ల్యూ ఎనర్జీ, ఎమ్‌సీఎక్స్ ఇండియా, వోల్టాస్, సోలార్ ఇండస్ట్రీస్, అదానీ పవర్ మొదలైన షేర్లు లాభాలు ఆర్జించాయి. ఐచర్ మోటార్స్, చోలా ఇన్వెస్ట్‌మెంట్, మారుతీ సుజుకీ, నిప్పాన్, ఏపీఎల్ ఆపోలో మొదలైన షేర్లు నష్టాలు మూటగట్టుకున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 307 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 330 పాయింట్లు కోల్పోయింది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 93.38గా ఉంది.

## నాంపల్లి రెడ్‌హిల్స్‌లో అగ్నిప్రమాదం

### సకాలంలో మంటలను ఆర్పిన ఫైర్ సిబ్బంది

హైదరాబాద్, ఏప్రిల్ 13: నాంపల్లి రెడ్‌హిల్స్‌లోని మూడంతస్తుల భవనంలో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. భవనం మూడో అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో భవనంలో 23 మంది నివాసితులు ఉన్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. భవనంలో చిక్కుకున్న 23 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదని, ప్రాణనష్టం ఏమీ లేదని అధికారులు తెలిపారు. మంటలు వేగంగా వ్యాప్తి చెందే అవకాశం ఉన్నప్పటికీ, అగ్నిమాపక శాఖ సిబ్బంది త్వరితగతిన స్పందించి.. మంటలు ఇతర ఫ్లోర్లకు వ్యాపించకుండా నివారించారు. చివరకు మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు. భవనంలో ఒక్కసారిగా మంటలు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మంటలు పూర్తిగా అదుపులోకి రావడం, ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. అగ్నిప్రమాదంపై స్థానిక పోలీసులు, అగ్నిమాపక అధికారులు దర్యాప్తు మొదలుపెట్టారు.

## ఘోర రోడ్డు ప్రమాదం

### స్కూటీని ఢీకొట్టిన లారీ

### ప్రమాదంలో దంపతులతో సహా చిన్నారి మృతి



వికారాబాద్,ఏప్రిల్13 : వికారాబాద్ జిల్లాలో తీవ్ర విషాదం నెల కొంది. పెద్దేముల్ మండలం తట్టేపల్లి దగ్గర ఓ టూ వీలర్‌ను లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భార్యాభర్తలు సహా ఓ చిన్నారి దుర్మరణం చెందింది. మృతులు తాండూరు నుంచి జహీరాబాద్ వైపు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కాగా, యాక్సిడెంట్ తర్వాత పారిపోయిన లారీ డ్రైవర్.. పెద్దేముల్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయినట్లు తెలుస్తోం ది. పెద్దేముల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల పరిధిలోని త్తటెపల్లి గ్రామ శివారులో రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతి చెందారు. వికారాబాద్ జిల్లా రుక్మాపూర్ గ్రామానికి చెందిన పావని (35), ఆమె భర్త కవిరాజ్ (40) జహీరాబాద్‌లో నివసిస్తున్నారు. వీరు ఆదివారం సాయంత్రం జహీరాబాద్ నుంచి రుక్మాపూర్ గ్రామానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా లారీ వీరి స్కూటీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పావని, కవిరాజ్, కీర్తన అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. కుమారుడు కార్తీక్ స్వల్ప గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. చికిత్స నిమిత్తం తాండూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ మహమ్మద్ షరీఫ్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పెద్దేముల్ పోలీసులు తెలిపారు.


## విషగుళికలు తిని చిన్నారి మృతి



ములుగు,ఏప్రిల్13 : ములుగు జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. కోతుల బెడద తప్పించుకోవడానికి పెట్టిన విషగుళికలు తిని నాలుగేళ్ల బాలుడు మరణించాడు. వివరాల్లోకి వెళ్తే.. ములుగు జిల్లా గోవింద రావు పేటలోని కోతుల బెడద ఎక్కువగా ఉంది. దీంతో కోతులను చంపేందుకు అంగన్‌వాడీ కేంద్రంలోని నర్సరీ ప్రాంతంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విషగుళికలను పెట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్న పిల్లలకు ఇచ్చే బాలామృతంలో వాసన లేకుండా ఉండే విష గుళికలను కలిపి పెట్టారు. ఎన్టీఆర్ నగర్‌కు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు శ్రవణ్ కుమారుడు హర్షిత్ నందన్ (4) ఆదివారం సాయంత్రం స్నేహితులతో ఆడుకుంటూ అంగన్‌వాడీ కేంద్రం సమీపంలోకి వెళ్లాడు. ఆ సమయంలో విష గుళికలు కలిపిన బాలామృతం చూశాడు. దాన్ని తినేశాడు. అనంతరం అస్వస్థతకు గురవ్వడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ములుగు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ హర్షిత్ సోమవారం తెల్లవారుజామున మృతిచెందాడు.

## పాదచారులపై దూసుకెళ్లిన ట్రక్కు

### ఏడుగురు వ్యక్తులు అక్కడిక్కడే మృతి



రాజ్‌కోట్,ఏప్రిల్13 : ఓ ట్రక్కు అదుపుతప్పి రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఏడుగురు అక్కడికక్కడే మరణించారు. వారిలో ఆరుగురు యాత్రికులు కాగా.. మరో వ్యక్తి రోడ్డు పక్కన తన వాహనం టైరు మారుస్తున్న డంపర్ డ్రైవర్. యాత్రికులు రాజస్థాన్‌లోని రాజ్‌కోట్ లోని గద్కా గ్రామం నుంచి దేకావాలా లోని మహదేవ్ ఆలయానికి వెళ్తుండగా.. సోమవారం తెల్లవారుజామున లఖ్తర్-విరామ్‌గామ్ రహదారిపై భాస్కర్‌పారా సమీపంలో ప్రమాదం జరిగింది. రాజ్‌కోట్‌లోని గద్కా గ్రామం నుంచి దేకావాలాలోని మహాదేవ్ ఆలయానికి నడుచుకుంటూ వెళ్తున్న యాత్రికులు.. మార్గమధ్యలో భాస్కర్‌పారా సమీపంలో ఓ వ్యక్తి రోడ్డుపై ఆగిపోయిన డంపర్‌కు టైరు మారుస్తున్నాడు. యాత్రికులు ఆ డంపర్‌ను దాటుతున్న సమయంలో వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన ట్రక్కు వారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆరుగురు యాత్రికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. వారిలో ఐదుగురు మహిళలు, ఒక పురుషుడు ఉన్నారు. అదేవిధంగా డంపర్ టైరు మారుస్తున్న డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు.దాంతో మొత్తం మృతుల సంఖ్య ఏడుకు చేరింది. ప్రమాద సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా ప్రాంతానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వచ్చే విద్యా సంవత్సరానికి డిగ్రీ ప్రవేశాలు

- 15నుంచి సీట్ల భర్తీకి తొలివిడత ప్రక్రియ
- తెలంగాణలో దోస్త్ నోటిఫికేషన్ విడుదల



హైదరాబాద్, ఏప్రిల్ 13: రాష్ట్రంలో వచ్చే విద్యా సంవత్సరం 2026-27లో ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కాలేజీల్లో సీట్ల భర్తీకి నిర్వహించే దోస్త్ నోటిఫికేషన్‌ను తెలంగాణ ఉన్నత విద్యామండలి విడుదల చేసింది. ఈనెల 15వ తేదీ నుంచి మే 7వ తేదీ వరకు తొలి విడతలో సీట్ల భర్తీ ప్రక్రియ కొనసాగుతుంది. అర్హులైన విద్యార్థులు రూ.200 రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. ఏప్రిల్ 30వ తేదీ నుంచి మే 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లకు అవకాశం కల్పించారు. ఒక మే 14వ తేదీన తొలి దశ సీట్ల కేటాయింపు జరగనుంది. సీట్ల కేటాయింపు అనంతరం ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. ఇక రెండో దశ సీట్ల రిజిస్ట్రేషన్ పక్రియ మే 15వ తేదీ నుంచి మే 25వ తేదీ వరకు కొనసాగనుంది. మే 15వ తేదీ నుంచి మే 26వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. మే 30వ తేదీ సీట్లు కేటాయిస్తారు. మూడో విడత రిజిస్ట్రేషన్ పక్రియ మే 31వ తేదీ నుంచి జూన్ 15వ తేదీ వరకు జరగనుంది. జూన్ 16వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చు. జూన్ 20వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుంది. రెండో, మూడో విడత సీట్ల కేటాయింపు అనంతరం కూడా ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాల్సి ఉంటుంది. సీట్లు పొందిన విద్యార్థులు ఆయా కాలేజీల్లో జూన్ 20 నుంచి 27వ తేదీ మధ్యలో హాజరై అడ్మిషన్ పక్రియను పూర్తి చేయాల్సి ఉంటుంది. జూన్ 29, 30వ తేదీల్లో ఓరియంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. జూలై 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.

# ఐటి ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి

- ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు ఉండరాదు
- ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్న బండి సంజయ్



హైదరాబాద్, ఏప్రిల్ 13: నాసిక్‌లో జరిగిన 'లవ్ జిహాద్' ఆరోపణల కేసు నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ తీవ్రంగా స్పందించారు. హైదరాబాద్ ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. ఈ మేరకు బండి సంజయ్ కుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు. దేశవ్యాప్తంగా, ముఖ్యంగా ఐటీ రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులపై మతపరమైన ఒత్తిళ్లు, వేధింపులు, రహస్య నెట్‌వర్క్‌ల ప్రభావం ఉండకూడదని తెలిపారు. హైదరాబాద్‌లో లక్షలాది మంది ఐటీ ఉద్యోగులు ఉన్నందున వారి పని వాతావరణం కేవలం కెరీర్ అభివృద్ధికి మాత్రమే పరిమితం కావాలని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వానికి బండి సంజయ్ కొన్ని కీలక సూచనలు చేశారు. అన్ని ప్రధాన ఐటీ కంపెనీల హెచ్‌ఆర్ బృందాలతో తక్షణ సమావేశం నిర్వహించాలని సూచించారు. ఉద్యోగుల భద్రతపై స్పష్టమైన విధానాలు రూపొందించాలని అన్నారు. ఉద్యోగుల ఫిర్యాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఏ కేసును కూడా దాచిపెట్టకూడదని చెప్పుకొచ్చారు. ఉద్యోగులు కార్యాలయాల్లో స్వేచ్ఛగా, భద్రతతో పనిచేసే వాతావరణం ఉండాలని బండి సంజయ్ కుమార్ సూచించారు. ఏ రకమైన ఒత్తిడి, వేధింపులు, దోపిడీకి అవకాశం ఇవ్వకూడదని స్పష్టం చేశారు. అలాగే, బాధితులు ఒంటరిగా ఉండకుండా వారికి తగిన రక్షణ, మద్దతు అందించాలని సూచించారు. పలువురు ఉద్యోగులు ఇప్పటికే కార్యాలయాల్లో జరిగిన అనుభవాలను సోషల్ మీడియాలో పంచుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ హెచ్చరిక సంకేతాలను ప్రభుత్వం, కంపెనీలు నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. ఐటీ కంపెనీల యాజమాన్యాలు, హెచ్‌ఆర్ విభాగాలు ఉద్యోగుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని బండి సంజయ్ కుమార్ కోరారు. ప్రతి ఫిర్యాదును నిష్పక్షపాతంగా, వేగంగా పరిష్కరించాల్సిన అవసరం ఉందని చెప్పారు. నాసిక్ కేసు నేపథ్యంలో వచ్చిన ఈ వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా ఐటీ రంగ భద్రతపై చర్చను మరింత పెంచాయని తెలిపారు. ఉద్యోగుల రక్షణ, కార్యాలయాల్లో పారదర్శకత, ఫిర్యాదు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ఇప్పుడు కీలకంగా మారాయని పేర్కొన్నారు.

# మహిళా రిజర్వేషన్లపై విమర్శలు తగవు

- ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందే
- డి లిమిటేషన్‌తో ఎవ్వరికీ అన్యాయం జరగదు
- సిఎం రేవంత్ వ్యాఖ్యలపై ఎంపి డికె అరుణ




హైదరాబాద్, ఏప్రిల్ 13: మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్‌ను దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని ఎన్డీయే కూటమి పార్టీల నేతలే చెబుతున్నారని బిజెపి ఎంపి డికె అరుణ అన్నారు. మహిళా రిజర్వేషన్ అంశానికి ప్రతిపక్ష పార్టీలు మద్దతు ఇస్తూనే డీలిమిటేషన్‌పై విమర్శలు చేస్తున్నాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా విమర్శలు చేయడం సరికాదని ఆమె వ్యాఖ్యలు చేశారు. దక్షిణాది, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఎంపీ డీకే అరుణ తీవ్రంగా స్పందించారు. మహిళా రిజర్వేషన్లు, పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళల ప్రాతినిధ్యం పెంచడానికి సాయపడుతుందని డీకే అరుణ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అంశంపై రాజకీయం చేయవద్దని ప్రతిపక్ష పార్టీలకు ఆమె సూచించారు. ఈ రిజర్వేషన్ల ద్వారా చట్టసభల్లో మహిళలకు సమాన అవకాశాలు లభిస్తాయని, దీనికి పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరి మద్దతును అవసరమని ఆమె అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో, ఇలాంటి చట్టాలు మహిళలకు చాలా మేలు చేస్తాయని ఎంపీ తెలిపారు. రిజర్వేషన్లతో చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరుగుతుందని డీకే అరుణ అన్నారు.డీలిమిటేషన్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గాల పునర్విభజనపై సీఎం రేవం త్ రెడ్డికి అవగాహనలేదన్నారు.తాము కూడా దక్షిణాదిలోనేఉన్నామని, అన్యాయం జరగని వ్వబోమని చెప్పారు. 2011 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరుగుతుం దని, ఈ పక్రియకు రెండేళ్ల సమయం పడు తుందన్నారు. డీలిమిటేషన్, మహిళల రిజర్వే షన్లను రాజకీయం చేయొద్దని కాంగ్రెస్ ను కోరుతున్నాని తెలిపారు. ఈ మొత్తం వ్యవ హారాన్ని రేవంత్‌కే వదిలేస్తున్నాని కిషన్‌రెడ్డి అన్నారు.

# బిఆర్ఎస్‌తో పొత్తు ఇక్కడికే పరిమితం

- ఖానాపూర్ సభలో బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు





నిర్మల్,ఏప్రిల్13 : పొత్తులపై తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి విజయం సాధించడాన్ని పురస్కరించుకుని నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విజయోత్సవ సభలో ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో బీజేపీ ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. ఖానాపూర్‌లో బీఆర్ఎస్‌తో జరిగిన పొత్తు స్థానిక నాయకుల మధ్య మాత్రమే జరిగిందని.. పార్టీ స్థాయిలో కాదని వివరించారు. ఖానాపూర్ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులు, పోలీసుల బలంతో గుండాయిజం చేసినా ప్రజలు బీజేపీకి మద్దతు ఇచ్చి పట్టం కట్టారని అన్నారు. కాంగ్రెస్ అధికారబలం ఖానాపూర్‌లో పనిచేయలేదని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయం ఉంటేనే అసెంబ్లీ సీట్లు పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని రాంచందర్ రావు విమర్శించారు. ఈ వ్యాఖ్యలు పేదవారిని, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిని అణచివేయాలనే ఉద్దేశంతో ఉన్నాయని ఆయన అభిప్రాయపడ్డారు. 50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఎన్నడూ మహి ళల హక్కుల గురించి మాట్లాడలేదని వ్యాఖ్యానించారు.మహిళలకు33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బీజేపీ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంతో ఏప్రిల్ 16న మహిళా రిజర్వేషన్ కోసం ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనుందని తెలంగాణబీజేపీచీఫ్‌రాంచందర్‌రావు వెల్లడించారు.

## మహిళా కోటాతో

## డీలిమిటేషన్‌కు ముడిపెట్టవద్దు

- మహిళా కోటాను వెంటనే అమలు చేయండి
- డీ లిమిటేషన్‌పై సమిష్టిగా చర్చించాల్సిందే
- ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ రెడ్డి సూచన



హైదరాబాద్, ఏప్రిల్ 13: అసెంబ్లీ సీట్లలో మహిళా కోటా వెంటనే అమలు చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ పేరుతో డీలిమిటేషన్‌ని ముందుకు తేవొద్దని సూచించారు. డీలిమిటేషన్‌పై కేంద్రం తీరు సరైనది కాదని పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్, లోక్‌సభ డీలిమిటేషన్ వేర్వేరు అంశాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీకి ప్రస్తావించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి ట్వీట్ పెట్టారు. జనాభా ఆధారిత డీలిమిటేషన్‌పై ఆందోళనలు చేయొద్దని అన్నారు. దక్షిణ, చిన్న రాష్ట్రాలకు అన్యాయం జరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డీలిమిటేషన్ తాత్కాలిక రాజకీయ లాభమని, కానీ దేశానికి తీరని నష్టమని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ ప్రయోజనం.. పార్టీ ప్రయోజనాల కంటే ముఖ్యమైనదని చెప్పారు. పోరాటా విధానానికి ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని సూచించారు. డీలిమిటేషన్‌పై అన్ని పార్టీలతో చర్చించి కేంద్ర ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు.

## శ్రీపాదరావుకు సిఎం రేవంత్ నివాళి



హైదరాబాద్, ఏప్రిల్ 13: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27 వ వర్ధంతి సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆయన చిత్రపటం వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాళులు అర్పించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ఒక ప్రత్యేకతను చాటుకున్న నాయకుడు దుద్దిళ్ల శ్రీపాదరావు అని ఈ సందర్భంగా సీఎం నివాళి అర్పించారు. సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అన్ని పదవులకు వన్నె తెచ్చిన నేత అని ఆయన కొనియాడారు. శాసనసభ ఔనత్యాన్ని పెంపొందిస్తు హుందాగా ఆయన సభను నడిపిన తీరు శ్లాఘనీయమని ముఖ్యమంత్రి అన్నారు. దుద్దిళ్ల శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఒక గొప్ప స్ఫూర్తి అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి,ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎంఎల్ ఏ సంజయ్ పాల్గొన్నారు.

## ఆశాకు క్రికెటర్ సచిన్ నివాళి

ముంబై,ఏప్రిల్13 :ఆశా భౌతికకాయానికి భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్, అతడి భార్య అంజలితో కలిసి నివాళులు అర్పించాడు. ఆశా భోస్లేతో సచిన్ కుటుంబానికి చాలా కాలంగా అత్యంత సన్నిహిత సంబంధం ఉంది. ఆమె భౌతిక కాయానికి నివాళులు అర్పిస్తూ సచిన్ కంటతడి పెట్టుకున్నాడు. అక్కడే ఉన్న ఆమె కుటుంబ సభ్యులతో మాట్లాడి సంతాపం తెలిపాడు. అతడితో పాటు ఆశా భోస్లేను చివరిసారిగా చూసేందుకు వచ్చిన సినీ, రాజకీయ ప్రముఖులు కూడా కన్నీటి వీడ్కోలు పలికారు. సంగీత ప్రపంచంలో ఆమె సేవలను స్మరించుకుంటూ దేశవ్యాప్తంగా ప్రముఖులు నివాళులు అర్పించారు. ప్రముఖ గాయని ఆశా భోస్లే ఆదివారం కన్నుమూసిన సంగతి తెలిసిందే. ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 92 ఏళ్ల వయసులో ఆమె కన్నుమూశారు. ఆశా అంత్యక్రియలు సోమవారం సాయంత్రం ముంబైలోని శివాజి పార్క్‌లో జరిగాయి. ఆమె భౌతికకాయాన్ని సందర్శనార్థం ముంబైలోని నివాసంలో ఉంచగా పలువురు ప్రముఖులు సందర్శించి నివాళి అర్పించారు. .

## సమ్మెపై కార్మికులు ఆలోచించాలి: పొన్నం

హైదరాబాద్,ఏప్రిల్13:తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మంత్రి పొన్నం ప్రభాకర్ స్పందించారు. రెండు అంశాలపై ప్రభుత్వం కమిటీ వేసిందని తెలిపారు. కమిటీ నుంచి పూర్తి వివరాలు వచ్చిన తర్వాత కార్మికులకు అనుగుణంగా నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఆర్టీసీ విలీనం, యూనియన్ అంశంపై కమిటీ వేసినట్లు తెలిపారు. మిగతా అంశాలు క్లియర్ చేయడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులు ఆలోచించాలని.. తొందర పడవద్దని మంత్రి పొన్నం విజ్ఞప్తి చేశారు. సమ్మెకు సిద్ధమవుతున్న ఆర్టీసీ కార్మికులు.. లేబర్ కమిషనర్‌తో చర్చలు జరపాలని నిర్ణయించారు. లేబర్ కమిషనర్ కార్యాలయం వద్దకు భారీగా ఆర్టీసీ కార్మికులు చేరుకోవాలని జేఏసీ పిలుపునిచ్చింది. చర్చల అనంతరం సమ్మె తేదీ ప్రకటించే అవకాశం ఉంది . ప్రభుత్వం తమ డిమాండ్లపై స్పందించకపోతే ఈనెల 20 నుంచి సమ్మెకు వెళ్లాలని ఆర్టీసీ కార్మికులు యోచిస్తున్నట్లు సమాచారం. మార్చి 13న యాజమాన్యానికి ఆర్టీసీ జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే.

## రాష్ట్రపతిని కలిసిన లోకేశ్ బృందం



న్యూఢిల్లీ,ఏప్రిల్13 : రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు ఎపి ప్రతినిధి బృందం కృతజ్ఞతలు తెలిపింది. అమరావతి బిల్లు అమల్లోకి రావడంతో ఏపీ మంత్రి నారా లోకేశ్, కూటమి ఎంపీలు ముర్ముతో భేటీ అయ్యారు. అమరావతి బిల్లు చట్టరూపం దాల్చడంతో.. లోకేశ్ బృందం రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపింది. అమరావతి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యాన్ని రాష్ట్రపతికి లోకేశ్ వివరించారు. అమరావతి రాజధాని ప్రజల కల అన్నారు. ఇందుకోసం రైతులు 33 వేల ఎకరాలు ఉదారంగా ఇచ్చారని అన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో జరిగిన నష్టాన్ని వివరించారు.

## వికసిత భారత్ లక్ష్య సాధనలో మినరల్స్ కూడా కీలకమే

(మొదటిపేజీ తరువాయి)

చేశామని కేంద్ర మంత్రి వెల్లడించారు. 7వ విడతలో 19 బ్లాక్స్‌ల వేలం ప్రారంభమైందన్నారు. మినరల్ ఎక్స్‌ప÷-లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభమైందని.. త్వరలోనే 11 బ్లాక్స్‌లకు రెండో విడత లైసెన్స్ వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. తెలంగాణలో 2 వెనేడియం, టైటానియం బ్లాక్స్ సిద్ధం చేసినట్లు మంత్రి ప్రకటించారు. మైనింగ్ కార్యకలాపాలను వేగవంతం చేయడం కోసం చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నామని చెప్పారు. రాష్ట్రాలు స్వతంత్రంగా వేలం నిర్వహించే అవకాశం కల్పించనున్నట్లు చెప్పారు. పర్యావరణ అనుమతుల పక్రియను సరళీకరించడం, 24 మినరల్స్‌పై కస్టమ్స్ డ్యూటీ రద్దు చేయడం, త్వరగా ఉత్పత్తి ప్రారంభించే కంపెనీలకు ప్రోత్సాహకాలు అందించడం వంటి చర్యలు తీసుకోనున్నట్లు కిషన్ రెడ్డి వివరించారు. స్క్రాప్ నుంచి మినరల్స్ రీసైక్లింగ్‌పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. విదేశాల్లో మైనింగ్ ప్రయత్నాలు చేపట్టామని తెలిపారు. రక్షణ రంగం, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీకి క్రిటికల్ మినరల్స్ కీలకమని.. ప్రైవేట్ సంస్థలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. భారత్‌ను గ్లోబల్ మైనింగ్ లీడర్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## అక్రమ నిల్వలపై దాడులు

(మొదటిపేజీ తరువాయి)

శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు గ్యాస్ సిలిండర్ల ను అక్రమ నిల్వ, పక్కదారి పట్టించే వారిపై అధికారులు నిఘా ఉంచి, ఆకస్మిక తనిఖీలు చేస్తున్నారు. డొమెస్టిక్ సిలిండర్ల సరఫరా పక్రియ నిబంధనల ప్రకారం సకాలంలో జరిగేందుకు బుకింగ్స్ / డెలివరీలను కమాండ్ కంట్రోల్ ద్వారా ఆయా ఏజెన్సీ లతో రోజువారీగా చెక్ చేస్తున్నారు. గత నెల రోజులుగా నిర్వహించిన దాడుల్లో అక్రమంగా తరలిస్తున్న, నిల్వ ఉంచిన 5,079 డొమెస్టిక్ సిలిండర్లు, మరో 70 చిన్న సిలిండర్లను విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ 1 కోటి 50 లక్షలు ఉన్నది. ఈ సందర్భంగా 2,089 కేసులు నమోదు చేశారు. వీరిపై చట్ట ప్రకారం చర్యలు చేపట్టారు. గ్యాస్ సిలిండర్ల అక్రమ నిల్వ, తరలింపు, డెలివరీ లో జాప్యంపై రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నెంబర్:1967 కు ఫిర్యాదు చేయాలని ప్రభుత్వం సూచించింది.

## ఢిల్లీ హైకోర్టులో విచారణ

(మొదటిపేజీ తరువాయి)

అన్నారు.కాగా, ఈడీ నమోదు చేసిన రెండు వేర్వేరు కేసుల్లో కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ కోర్టు ఇటీవల నిర్దోషిగా ప్రకటించింది. దీనిని ఎన్‌ఫోర్స్‌మెంట్ డెరెక్టరేట్ హైకోర్టులో సవాలు చేసింది. ఈడీ పిటిషన్‌పై జస్టిస్ స్వర్ణకాంత శర్మ నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం ఏప్రిల్ 6వ తేదీన విచారణ జరిపింది. ఈ సందర్భంగా, కేజ్రీవాల్ సహా పలువురు దాఖలు చేసిన రెక్యూసల్ పిటిషన్లపై సమాధానం ఇవ్వాలని సీబీఐకి ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

## పశ్చిమాసియాలో మళ్లీ యుద్ధమేఘాలు

(మొదటిపేజీ తరువాయి)

పరిమిత స్థాయిలో సైనిక దాడులను పునరుద్ధరించేలా అగ్రరాజ్య అధ్యక్షుడు ట్రంప్ సలహాదారులు ప్రణాళికలు రచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. అయితే, ఈ దాడులకు ట్రంప్ అంగీకరిస్తారా? లేదా అనేదానిపై ఇంకా స్పష్టత లేదు. ఇరాన్ (ఎసజీని)ను నలువైపులా నిర్బంధించి, హర్మూజ్ జలసంధిపై నియంత్రణ తెచ్చుకోవాలని ట్రంప్ భావిస్తున్నట్లు సమాచారం. మిత్ర దేశాలతో కలిసి ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు భద్రత కల్పించే అంశంపై అమెరికా అధ్యక్షుడు చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అటు, ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్ కూడా ఇరాన్‌పై దాడులు సిద్ధమవుతున్నట్లు సమాచారం. ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఐడీఎఫ్ చీఫ్ ఆఫ్ స్టాఫ్ లెఫ్టినెంట్ జనరల్ ఇయాల్ జమీర్ తన సైన్యాన్ని ఆదేశించినట్లు ఇజ్రాయెల్ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్‌పై దాడుల పునరుద్ధరణ విషయంలో ట్రంప్ నిర్ణయం కోసం ఇజ్రాయెల్ ఎదురుచూస్తున్నట్లు ఆ కథనాలు తెలిపాయి. అయితే, ఈలోగా టెహ్రాన్ తమపై దాడి చేస్తే మాత్రం ప్రతిస్పందన తీవ్రంగా ఉంటుందని ఐడీఎఫ్ హెచ్చరిస్తోంది. ఇదిలా ఉండగా.. యూఎస్-ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు చెలరేగాయి. ఇరాన్ పోర్టుల నుంచి నౌకలు హోర్మూజ్ మీదుగా రాకపోకలు సాగించకుండా నేటి సాయంత్రం 7.30 (భారత కాలమానం ప్రకారం) నిర్బంధం విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. దీంతో పాటు ఇరాన్‌పై యూఎస్, ఇజ్రాయెల్‌లు మళ్లీ దాడులు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.అణు కార్యక్రమాన్ని వదులుకునేలా ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ఇజ్రాయెల్ దాడులను ప్లాన్ చేస్తున్నట్టు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఆర్మీ సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఇజ్రాయెల్ రక్షణ దళం చీఫ్ లెఫ్టినెంట్ జనరల్ జమీర్ ఆదేశించారు. మరోవైపు, ఇరాన్‌పై పరిమిత స్థాయిలో దాడులు చేసేందుకు ట్రంప్, ఆయన సలహాదారులు యోచిస్తున్నట్టు తెలుస్తోంది. ఇరాన్‌ను అన్ని వైపుల నుంచి దిగ్బంధించి చర్చల్లో ప్రతిష్టంభనను తొలగించాలనేది యూఎస్ ప్రభుత్వం ఉద్దేశమని కథనాలు వెలువడ్డాయి. ఈ దిశగా నాటో దేశాలను కూడా రంగంలోకి దింపేందుకు అమెరికా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే హోర్మూజ్ మీదుగా నౌకల రాకపోకలను ఇరాన్ నిలిపివేసిన విషయం తెలిసిందే. హోర్మూజ్ జలాల్లోకి యూఎస్ యుద్ధ నౌకలు వస్తే దాడులు తప్పవని హెచ్చరించింది. చర్చలు విఫలం కావడానికి అమెరికానే కారణమని తేల్చి చెప్పింది. యూఎస్ పెట్టిన అసమంజసమైన డిమాండ్స్ కారణంగానే చర్చల్లో పీటముడి పడిందని పేర్కొంది. అణు కార్యక్రమం వదులుకునే దిశగా ఇరాన్ నుంచి స్పష్టమైన హామీలు రాలేదని యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ పేర్కొన్నారు.

## అసత్య ప్రచారాలు

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతున్న దుష్ప్రచారానికి కేసీఆర్ బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. తన ప్రతిష్టను దెబ్బతీసేలా కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని నోటీసులో పేర్కొన్నారు మంత్రి సీతక్క. 48 గంటల్లో పోస్టులు తొలగించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తీసుకుంటానని లీగల్ నోటీసులో పేర్కొన్నారు.

## ఓటుకు..నోటుకు లంకె పెట్టినట్లు అనుకున్నారా

నిలదీశారు. అసలు.. మీరు చెప్పే శాస్త్రీయత ఏమిటి..? డబ్బు సమకూర్చే వాళ్లకే ప్రాధాన్యత ఇవ్వాలని చెబుతున్నారా అని ప్రశ్నించారు. డబ్బుకు, ఓటుకు, సీటుకు లింకు పెడతారా..? లక్ష కోట్లు ఉన్న మీ కుటుంబానికి లక్ష ఓట్లు ఇవ్వాలా..? డబ్బులేని పేదవాడికి ఓటు హక్కు కల్పించొద్దా అని ప్రశ్నల వర్షం కురిపించారు. ముంబయికి, ఢిల్లీకి మాత్రమే అత్యధిక సీట్లు ఉండాలా.. వెనుకబడ్డ ఆదిలాబాద్, పాలమూరు జిల్లాలకు సీట్లు పెంచాల్సిన అవసరమే లేదా అని నిలదీశారు. మీ హైబ్రీడ్ మోడల్ అంటే ఇదేనా అని అన్నారు. ప్రతి అంశాన్ని రాజకీయం చేయడం తగదని చురకలంటించారు.

# హోర్మూజ్‌పై ట్రంప్ వ్యాఖ్యలు

- దిగ్బంధిస్తే తీవ్ర పరిణామాలు
- ఘాటుగా హెచ్చరికలుచేసిన ఇరాన్



టెహ్రాన్,ఏప్రిల్13 : హోర్మూజ్‌ను దిగ్బంధిస్తామన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక లపై ఇరాన్ మరోసారి ఘాటుగా స్పందించింది. హోర్మూజ్ ఇప్పటికీ తమ నియంత్రణలోనే ఉందని పేర్కొంది. శత్రువులు ఏ చిన్న పొరపాటు చేసినా ప్రమాదం తప్పదని హెచ్చరించింది. అంతకుముందు ఇరాన్ సైనిక దళం (ఐఆర్‌జీసీ) కూడా ట్రంప్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చిన విషయం తెలిసిందే. హోర్మూజ్ వైపు వచ్చే యుద్ధ నౌకలపై దాడి చేస్తామని హెచ్చరించింది. పౌర నౌకల రాకపోకలకు మాత్రం ఎలాంటి ఇబ్బందీ ఉండదని భరోసా ఇచ్చింది. యుద్ధ నౌకలు వస్తే మాత్రం కాల్పుల విరమణను ఉల్లంఘించినట్టేనని స్పష్టం చేసింది. ఇక యూఎస్‌తో చర్చలు విఫలం కావడంపై ఇరాన్ మంత్రి అరాగ్చీ ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. 47 ఏళ్ల తరువాత జరిగిన అత్యున్నత స్థాయి చర్చలకు తాము సదుద్దేశంతో వెళ్లామని చెప్పారు. ఒప్పందం అంగుళం దూరంలో ఉండగా యూఎస్ తన లక్ష్యాలను, ఉద్దేశాలను మార్చుకుందని ఆరోపించారు. మునుపటి అనుభవాల నుంచి ఎలాంటి గుణపాఠాలను అమెరికా నేర్చుకోలేదని అన్నారు. మంచి భావాలుంటే చివరకు మంచే జరుగుతుందని అన్నారు. మనసులో శత్రుత్వం ఉంటే తుదకు అదే మిగులుతుందని ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. సోమవారం హోర్మూజ్‌లో నౌకల ట్రాఫిక్ స్తంభించిపోయిందని లాయిడ్స్ లిస్ట్ ఇంటెలిజెన్స్ అనే మారిటైమ్ సంస్థ తాజాగా పేర్కొంది. హోర్మూజ్‌ను దిగ్బంధిస్తామన్న ట్రంప్ ప్రకటన తరువాత నౌకల రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొంది. ఎలాంటి ఒప్పందం లేకుండా ఇరాన్‌తో చర్చలు ముగియడంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి స్పందించారు. గతంలో కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం మాత్రం కొనసాగుతోందని అన్నారు. ఇరాన్ మళ్లీ చర్చలకు వస్తుందా? రాదా? అనేది తనకు ఇక అనవసరమని కూడా చెప్పారు. ఇప్పటికే ఇరాన్ పరిస్థితి దగజారిందని, మిలిటరీ ధ్వంసమైపోయిందని చెప్పారు. శాంతి చర్చలు విఫలమవడానికి అమెరికానే కారణమని ఇరాన్ ఆరోపించింది. యుద్ధాన్ని ముగించేందుకు అమెరికాతో ఇరాన్ చిత్తశుద్ధితో సంప్రదింపులు చేసింది. కానీ, ఇస్లామాబాద్ ఒప్పందానికి కొన్ని అంగుళాల దూరంలోనే చర్చలు కుప్పకూలాయి. అతివాద భావజాలం, లక్ష్యాలు మారడం, నిర్బంధం వంటివి మాకు ఎదురయ్యాయి. మంచి చేస్తే మంచి జరుగుతుంది. చెడు చేయాలని చూస్తే శత్రుత్వమే మిగులుతుందని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చి పోస్ట్ చేశారు.

# మహిళలంటే బిజెపికి చిన్నచూపు

- 15మంది బిజెపి అధ్యక్షులు మారినా..మహిళలకు చోటేది
- ముఖ్య పదవుల్లో కూడా మహిళలకు చోటవివ్వని బిజెపి
- కాంగ్రెస్‌లో ఇందిర, సోనియాలు అధ్యక్షులుగా పనిచేశారు
- బండి సంజయ్ విమర్శలు మాని నిజాలు తెలుసుకోవాలి
- సమవేశంలో సిఎం రేవంత్ రెడ్డి చురకలు



హైదరాబాద్, ఏప్రిల్ 13: సీట్ల పునర్విభజనలో పర్సంటేజీలు కాదు నెంబర్ ముఖ్యం అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాల్లో నెంబర్ ముఖ్యం అంటూ.. వాజపేయి ప్రభుత్వం ఒక్క ఓటుతో పడిపోయిందని గుర్తు చేశారు. నెంబర్ లేకుండా రాజకీయాల్లో ఎవరూ ఎవరితోనూ చర్చలు చేయరని అన్నారు. ఇకపోతే ఇప్పటివరకు15 మంది బీజేపీ అధ్యక్షుల నియామకం జరిగింది.. కాని ఇప్పటివరకు భారతీయజనతా పార్టీ అధ్యక్షురాలిగా ఒక్క మహిళ నియామకంజరగలేదని సిఎం రేవంత్ చురకలంటించారు. బీజేపీకి మహిళ పట్లగౌరవం, చిత్తశుద్ధి ఉందో అర్థమౌతుందన్నారు. ఇందిరాగాంధీ, సోనియా గాంధీ నాయకత్వంలో అతి ఎక్కువ కాలం పనిచేసిన పార్టీ కాంగ్రెస్ మహిళలకు అన్యాయం చేస్తుందా.. అని ప్రశ్నించారు. బీజేపీకి మహిళను అధ్యక్షురాలిగా నియమించుకున్న తర్వాత బండి సంజయ్ మాట్లాడాలన్నారు. బండి సంజయ్ వ్యాఖ్యలుదక్షణాది రాష్ట్రాల్లోని ఎస్సీ,ఎస్టీ, మహిళలకు వ్యతిరేకం.. అన్నారు. మా ఎంపీలు తెలంగాణను సాధించారు.. ఇప్పుడు పునర్విభజన పైన కూడా పోరాడుతారని సిఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రలతో పాటు చిన్న రాష్ట్రలను కూడా ఐక్యం చేస్తాం అని అన్నారు. పార్లమెంట్‌లో బిల్లును ఎలా ఆమోదిస్తారో చూస్తాం.. 60యేళ్లలోమహిళల కోసం కాంగ్రెస్ చాలా చేసింది..46యేళ్లలో ఒక్క మహిళను పార్టీ అధ్యక్షురాలిని బీజేపీ చేయలేదు.. జనరల్ సెక్రటరీ ఆర్గనైజేషన్ప దవి కూడా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్న చూపు చూడటమే బీజేపీలక్షణం.. ద్వితీయ శ్రేణి పౌరులుగా మహిళలను చూస్తున్నారు..స్వాతంత్య్రం తెచ్చింది, రాజ్యాంగాన్ని తెచ్చింది, రిజర్వేషన్లుకల్పించింది కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు దేశాన్ని కాపాడుకునే బాధ్యత కూడా కాంగ్రెస్ దే.. అన్నారు. యాభై శాతంతో సీట్ల పునర్విభజన జరిగితే కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు మోదీ ఇంటి ముందు బంట్రోతు లుగానిలబడాల్సివస్తుంది.. వాళ్ల అవసరం ఇక ముందు ఉండదన్నారు. అన్ని దక్షిణాది రాష్ట్రలతో పాటు ఢిల్లీ, పంజాబ్ లాంటి చిన్న రాష్ట్రలకు కుదీనిపైన లేఖ రాస్తానని సిఎం రేవంత్ అన్నారు. గతంలోనియోజకవర్గాల పునర్విభజన మూడు సార్లు జరిగింది.. 1967 లో 520సీట్లకు పెంచారు,1976 లో 542సీట్లకుపెంచారు..తర్వాత సిక్కిం నుంచి ఒక సీటు పెరిగి 543 కి పెరిగింది.. 2001 లో వాజ్ పేయి పునర్విభజన పైన చట్టసవరణ చేశారు. దాని వల్ల 2009 లో తెలంగాణకు17 ఎంపీ సీట్లు , ఆంధ్రాకు25 ఎంపీ సీట్లు వచ్చాయి...తెలంగాణ కు 119 అసెంబ్లీ సీట్లు, ఏపీకి175శాసన సభ సీట్లు పెరిగాయి.. స్థూల ఉత్పత్తిలో అత్యధికంగా భాగస్వామ్యం చేస్తున్న రాష్ట్రాలకు అవకాశం ఇవ్వాలి..ఈశాన్య రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో జనాభాప్రాతిపాదికన సీట్లు లేవు.. 100 శాతం జనాభాప్రాతిపదికన సీట్ల పెంపు జరగలేదు.. ప్రాతినిధ్యం కోసమే ఈశాన్య రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎంపీ సీట్లు ఇచ్చారని సిఎం గుర్తు చేశారు. సీట్ల పునర్విజభన పైన అఖిల పక్ష సమావేశంతో పాటు అన్ని సంస్థలతో సంప్రదింపులు చేయాలి.. పార్లమెంటులో పునర్విభజన పైన చర్చించాలి.. నిపుణలతో ఒక కమిటీ ఏర్పాటు చేయాలి.. అన్ని అసెంబ్లీల్లో చర్చకు పెట్టి పార్లమెంటులో ఆమోదించి నిర్ణయం తీసుకోవాలి.. 2028 మార్చి వరకు ఈ పక్రియను పూర్తి చేయొచ్చు...హడావుడిగా చేసి దేశంలో దక్షణ, ఉత్తరాది మధ్యగ్యాప్ పెంచొద్దని సిఎం రేవంత్ డిమాండ్ చేశారు

# మహిళా రిజర్వేషన్లతో పునర్విభజన లింక్

(మొదటిపేజీ తరువాయి)

పదవులు చేపట్టిన విషయాన్ని కూడా ఆయన ప్రస్తావించారు. మహిళా రిజర్వేషన్లు, డీలిమిటేషన్ రెండూ వేర్వేరు అంశాలని స్పష్టం చేసిన రేవంత్ రెడ్డి, వీటిని కలిపి బీజేపీ రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగిస్తోందని విమర్శించారు. ముఖ్యంగా 2011 జనాభా లెక్కల ఆధారంగా ఈ రెండు అంశాలను అనుసంధానించడం వెనుక రాజకీయ కుట్ర, వివక్ష ఉన్నాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు తమ పూర్తి మద్దతు ఉందని ప్రకటించిన సీఎం రేవంత్, ప్రస్తుతం ఉన్న పార్లమెంట్ సీట్ల ఆధారంగానే ఈ బిల్లును అమలు చేయాలని కేంద్రాన్ని కోరారు. 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలోనే ఈ బిల్లును అమలు చేసి ఉంటే, మరింత మంది మహిళలు పార్లమెంట్‌కు ఎన్నికయ్యేవారని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. రాజ్యాంగంలోనే పురుషులతో పాటు మహిళలకు ఓటు హక్కు ఇచ్చింది కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అప్పటికిప్రపంచంలోని చాలా దేశాల్లో మహిళలకు ఓటు హక్కు లేదు..

పురుషులతో పాటు మహిళలకు సమాన అవకాశాలు కల్పించింది కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని అన్నారు. దేశ ప్రధానిగా, రాష్ట్రపతిగా, లోక్ సభస్పీకర్ గా, ముఖ్యమంత్రులుగా, గవర్నర్లుగా చాలా రాజ్యాంగబద్ధమైన పదవుల్లో మహిళలకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందని గుర్తు చేశారు. మహిళలనాయకత్వంలోపనిచేసిన పార్టీ కాంగ్రెస్.. రాజీవ్ గాంధీ స్థానిక సంస్థల్లోమహిళలకురిజర్వేషన్లుతీసుకువచ్చారు.. సోనియా గాంధీ నాయకత్వంలో చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకువచ్చారు.. అప్పుడు రాజ్యసభలో ఆమోదించారు..బీజేపీ సహకరించకపోవడం వల్లనే లోక్ సభలోమహిళారిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందలేదన్నారు. ఇంతకాలం ప్రధాని మోదీ ఈ బిల్లును పట్టించుకోలేదు. 2023 లో మహిళారిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతుఇచ్చింది.. 2026 జనాభాలెక్కల తర్వాతగెజిట్ ఆధారంగా మహిళారిజర్వేషన్లు అమలు చేస్తామని చట్టం చేశారు... 2026జనభా లెక్కలు పూర్తి చేసి అమలు చేయకుండా 2011జనాభాలెక్కల ఆధారంగా చట్టం ముందుకు తెస్తున్నారు.. 2026జనాభా లెక్కలప్రకారం నిబంధనను సవరించుకుంటే 2029 లోక్ సభతో పాటు వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలుచేయొచ్చన్నారు. ఇకపోతే 2011 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ చేయాలని ఎన్డీయే చూస్తోందన్నారు. కానీ, 2026 జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్లు అమలు చేయాలన్నది కాంగ్రెస్ డిమాండ్ అని చెప్పారు. ఈ రెండింటినీ కలపడం, పాత జనాభా లెక్కల ప్రకారం వెళ్లడంలో కుట్ర ఉందని ఆక్షేపించారు. 33శాతం మహిళా రిజర్వేషన్లకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ఈ రిజర్వేషన్లను ఆర్నెల్లలోనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ పక్రియ చాలా ప్రమాదకర దిశలో వెళ్తోంది. చిన్న రాష్ట్రాలు, దక్షిణాదికి అన్యాయం జరిగేలా మోదీ కుట్ర చేస్తున్నారు. కుటుంబ నియంత్రణను దక్షిణాది రాష్ట్రాలు సమర్ధంగా అమలు చేశాయి. ఉత్తరాదిలో అది సరిగ్గా అమలు కాకపోవడం వల్లే జనాభా విపరీతంగా పెరిగింది. జనాభా ప్రాతిపదికన సీట్ల పెంపు వద్దని దక్షిణాది రాష్ట్రాలు గట్టిగా చెప్పాయి. దక్షిణాది రాష్ట్రాల వ్యతిరేకత వల్ల మోదీ కొత్త ప్రతిపాదన తీసుకొచ్చారు. ప్రతి రాష్ట్రంలో 50శాతం సీట్లు పెంచుతామని చెబుతున్నారు. ఇలా చేస్తే.. యూపీ, బిహార్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లలో సీట్లు బాగా పెరగనున్నాయి. ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య లోక్‌సభ సీట్లలో అంతరం భారీగా పెరుగుతుందన్నారు. సీట్ల పెంపు తర్వాత దక్షిణాదిలో 195 లోక్‌సభ స్థానాలు అవుతాయి. ఉత్తరాదిలో సీట్లు 620కి పెరుగుతాయి. ఉత్తర, దక్షిణాది మధ్య ప్రస్తుతం ఉన్న 210 సీట్ల అంతరం 412కి పెరుగుతుంది. ఎన్డీయే ప్రభుత్వంలో దక్షిణాది రాష్ట్రాలకు ఏమాత్రం ప్రాధాన్యం దక్కడం లేదు. కేంద్రంలోని కీలక శాఖలు ఏవీ దక్షిణాది రాష్ట్రాలకు ఇవ్వడం లేదు. సీట్లు పెంచాలనుకుంటే అఖిలపక్షాన్ని పిలిచి మాట్లాడాలి. ఏ ప్రాతిపదికన 50 శాతం సీట్లు పెంచుతారు? సీట్లు 50 శాతం పెంచాలని మోదీకి ఏ దేవుడు చెప్పాడు? 50శాతం సీట్లు పెంచితే ఉత్తరాది, దక్షిణాది మధ్య తీవ్ర అంతరం ఏర్పడుతుంది. దక్షిణాదిపై చూపుతున్న వివక్షతో దేశ సమగ్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల వివక్షను మరింత పెంచేలా భాజపా వ్యవహరిస్తోందన్నారు.

దక్షిణాది రాష్ట్రాల పరిస్థితి.. పన్నులు కట్టడం, దిల్లీకి వెళ్లి సలాం కొట్టడం అన్నట్లుగా ఉంది. దీనికి మేం వ్యతిరేకం. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఫైనాన్షియల్ కేపిటల్స్. ఉత్తరాది రాష్ట్రాలు పొలిటికల్ కేపిటల్స్. పొలిటికల్ కేపిటల్స్ ఎప్పుడూ ఫైనాన్షియల్ కేపిటల్స్‌ని తక్కువగా చూస్తాయి. దక్షిణాది రాష్ట్రాలు ద్వితీయ శ్రేణి పౌరులుగా మిగిలిపోతారని అన్నారు. హైబ్రిడ్ ప్రాతిపదికన సీట్లు పెంచాలనేది మా డిమాండ్. కొత్తగా పెంచే సీట్లలో 50 శాతానికి జీడీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి. కొత్తగా పెంచే సీట్లలో 136 సీట్లు జీడీపీ వృద్ధి ఆధారంగా పెంచాలి. మరో 136 సీట్లను జనాభా ప్రాతిపదికగా పెంచాలి. దేశానికి ఆదాయం ఇస్తున్న రాష్ట్రాలను గౌరవించాలి. చిన్న రాష్ట్రాలకు కూడా న్యాయం జరిగేలా గతంలో సీట్ల కేటాయింపు జరిగిందని రేవంత్‌రెడ్డి అన్నారు. మీడియా సమావేశంల మంత్రులు భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి, సీతక్క, పొంగులేటి, ఎంపిలు రఘురామిరెడ్డి, మల్లు రవి, సలహాదారు కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

## యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం




- బస్సు, ట్రక్కు ఢీకొన్న ప్రమాదంలో ఆరుగురు మృతి

లక్నో,ఏప్రిల్13:ఉత్తరప్రదేశ్ లో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హాపూర్ ప్రాంతంలో బస్సు, ట్రక్కు ఢీకొన్న ఘటనలో ఆరుగురు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. పెళ్లి వేడుక నుంచి తిరిగి వస్తున్న ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ముందున్న ట్రక్కును ఢీకొట్టడంతో ఈ ప్రమాదం సంభవించినట్లు పోలీసులు తెలిపారు. ఘటన సమాచారం అందిన వెంటనే అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు ప్రారంభించారు. ఎస్పీ జ్ఞానంజయ్ సింగ్ వివరాల ప్రకారం, ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. గాయపడిన వారిని సమీప ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాదానికి గురైన ట్రక్కును రహదారి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు. మృతుల కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని విషాదంలో మునిగిపోయారు. బస్సులో ప్రయాణిస్తున్న 12 మందిని గుర్తించగా, ఒక వ్యక్తి ఆచూకీ ఇంకా తెలియరాలేదని అధికారులు తెలిపారు. బస్సు డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు.

## అమెరికా ట్యాంక్ విమానానికి తూట్లు

### భారీగా నష్టం కలిగించిన ఇరాన్

లండన్,ఏప్రిల్13 : ఎంతో శక్తిమంతమైన, అధునాతనమైన అమెరికా యుద్ధ విమానాలకు పశ్చిమాసియాలో గట్టి ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. అమెరికా ఎంతో గొప్పగా చెప్పుకునే వైమానిక దళానికి ఇరాన్ యుద్ధంలో భారీ నష్టం సంభవించింది. పలు యుద్ధ విమానాలు ధ్వంసమయ్యాయి. వాటిల్లో కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానం కూడా ఒకటి.తాజాగా ఓ కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానం యూకేలోని ఆర్‌ఏఎఫ్ మిల్డెన్ హాల్ ఎయిర్‌బేస్‌లో ల్యాండ్ అయింది. ఆ విమానానికి చాలా తూట్లు పడ్డాయి. విమానం పై భాగంలో మరమ్మత్తులు చేసిన గుర్తులు కూడా కనిపించాయి. యూకే ఏవియేషన్ ఫొటోగ్రాఫర్ ఆండ్రూ మెక్‌కెల్వీ ఈ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గత నెలలో సౌదీ అరేబియాలోని అమెరికా వైమానిక స్థావరంపై ఇరాన్ క్షిపణి దాడులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ఆ దాడుల్లో ఐదు కేసీ-135ఆర్ ట్యాంకర్ విమానాలు దెబ్బతిన్నాయి. తాజాగా యూకేలో ల్యాండ్ అయిన విమానం ఆ అయిదింటిలో ఒకటి అయి ఉండొచ్చని తెలుస్తోంది.

## భూ పరిపాలనకు కొత్త దిక్సూచి భూభారతి

భూభారతి చట్టం తెలంగాణ చరిత్రలో కీలక సంస్కరణగా నిలుస్తోందన్నారు. ఈనెల 14వ తేదీతో భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా సోమవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో మంత్రి గారు అధికారులతో భూభారతి చట్టంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాదని, తెలంగాణ రాష్ట్రంలో భూహక్కుల రక్షణకు ప్రారంభమైన కొత్త శకానికి నాందిపలికిన రోజని వ్యాఖ్యానించారు. భూభారతి చట్టానికి ముందు ఆ తర్వాత ఉన్న పరిస్థితులపై అధికారులతో చర్చించారు. ఈ చట్టం తీసుకువచ్చే నాటికి ధరణి పోర్టల్ వల్ల తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న పరిస్థితులను ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తు చేశారు. 'నాటి పరిస్థితిని పూర్తిగా మార్చాలన్న సంకల్పంతో పారదర్శకత, బాధ్యతాయుత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో రెవెన్యూ వ్యవస్థను ప్రజలకు చేరువచేస్తున్నాం. ఈ క్రమంలోనే చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తీసుకువచ్చాం. ఈ చట్టం రాష్ట్రంలోని భూ పరిపాలనను పారదర్శకంగా సులభంగా మార్చింది. బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ వల్ల లక్షలాది మంది ప్రజలు తమ భూముల హక్కుల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. భూమి తమదే అయినప్పటికీ హక్కులను నిరూపించుకునేందుకు అధికారుల, కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండేది. ఆనాటి పరిస్థితులను చూసి అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని ఇచ్చిన మాటను నిలబెట్టుకొని గత ఏడాది ఏప్రిల్ 14న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి రోజున గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారి చేతుల మీదుగా భూభారతి పోర్టల్‌ను ఆవిష్కరించుకున్నాం.తెలంగాణ రైతాంగానికి భూ భద్రత కల్పించడంలో భూభారతి ఒక బలమైన ఆయుధంగా మారింది. భూ వివాదాలకు చరమగీతం పాడుతూ, సామాన్యుడికి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించడంలో ఈ ఏడాది కాలం ఒక గొప్ప ముందడుగుగా నిలిచింది. ఈ 12 నెలల కాలంలో భూభారతి పోర్టల్ పాత చిక్కుముడులను విప్పడంలో కీలక పాత్ర పోషించింది. ఈ పోర్టల్ ప్రారంభించిన ఏడాదిలోపే 5.20 కోట్లకు పైగా ప్రజలు ఈ పోర్టల్‌ను సందర్శించారు. సుమారు 67 లక్షల మంది పోర్టల్ ద్వారా లాగిన్ అయ్యారు. ప్రజల కోసం రెవెన్యూ శాఖ లో గణనీయమైన మార్పులు తెస్తున్నాం. రైతులకు పారదర్శకంగా సులభతరమైన సేవలు అందించడానికి రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ / రిజిస్ట్రేషన్ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి కేంద్ర ప్రభుత్వం సంస్థ ఎన్.ఐ.సి.తో కలిసి రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను ఈనెల 2వ తేదీ నుంచి ఐదు జిల్లాల్లోని ఐదు మండలాల్లో? ప్రయోగాత్మకంగా ప్రారంభించడం జరిగింది. ఇక్కడ ఎదురయ్యే మంచి చెడులను పరిగణనలోకి తీసుకొని అవసరమైన మార్పులు చేర్పులు చేసి వచ్చే నెలలో జిల్లాకు ఒక మండలంలో ప్రారంభిస్తాం.ఈ ఐదు మండలాల్లో కూడా ప్రతి సర్వే నెంబరుకు భూధార్ నెంబర్‌ను కేటాయిస్తాం. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న సంకల్పంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. రాష్ట్రంలో నిజాం కాలం నుంచి 378 గ్రామాలను నక్షాలు లేవు. ఇందులో ఐదు గ్రామాలలో రీ సర్వే పూర్తి చేసి భూదార్ నెంబర్ కేటాయించాం.మిగిలిన 373 గ్రామాల్లో రోవర్స్ వంటి ఆధునిక సర్వే సాంకేతికతను ఉపయోగించి రీసర్వే పనులు కొనసాగిస్తున్నాం. ÷ల్లాకు 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సర్వే చేపట్టబోతున్నాం. సర్వే అనంతరం హద్దులను గుర్తించి భూధార్ నెంబర్ ఇస్తాం. ఈ విధంగా రాష్ట్ర వ్యాప్తంగా దశల వారీగా సర్వే నిర్వహించాలని నిర్ణయించాం.తెలంగాణ ప్రాంతంలో 1948 నాటికి సుమారు 40 లక్షల సర్వేనెంబర్లు వినియోగంలో ఉండగా అప్పటి నుంచి ఇప్పటివరకు ఈ 77 సంవత్సరాలలో 2కోట్ల 29 లక్షలకు చేరాయి. వీటన్నింటికీ భూధార్ నెంబర్ ఇవ్వడానికి ప్రణాళికలు తయారుచేస్తున్నాం. భూ సర్వేకు అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవడం జరిగింది. శిక్షణ ఇచ్చి 5,520 మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లకు లైసెన్స్‌లు జారీ చేశాం. భూవిస్తీర్ణాన్ని బట్టి ప్రతి మండలానికి 4 నుంచి 6గురు సర్వేయర్లను నియమించాం. రాష్ట్రంలోని 10,984 రెవెన్యూ గ్రామాలను క్లస్టర్లుగా విభజించి జీపీవోలను నియమించడం జరిగింది. గొలుసులు, కర్రలు, క్రాస్ స్టాఫ్, మెజరింగ్ టేప్ వంటి పాత సర్వే పరికరాలకు స్వస్తి చెప్పి అత్యాధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం వీలైనంత వరకు వినియోగించుకుంటున్నాం.

# అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు

- వికలాంగులకు ట్రై సైకిళ్లు
- మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ
- ఫోన్‌ల కొనుగోళ్లలో అక్రమాలు లేవన్న తుమ్మల

**బలగం టీవీ, ఖమ్మం**

సంక్షేమ పథకాల అమలు, మహిళల ఆర్థిక స్వావలంబన దిశగా ముందడుగు వేసింది. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని, అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్లు, వికలాంగులకు ట్రై సైకిళ్లు, మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ సందర్భంగా మంత్రి తుమ్మల కీలక వ్యాఖ్యలు చేశారు. అంగన్వాడీల సేవలు అమూల్యమని, రాజకీయాలకు అతీతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'అంగన్వాడీలకు రాజకీయాలతో పనిలేదు. పేద ప్రజలకు, చిన్నారులకు సేవ చేసే గొప్ప భాగ్యం మీకు దక్కింది. యూనియన్ల పేరుతో గొడవలు చేయడం వల్ల జీవితాలు బాగుపడవు, నిబద్ధతతో పనిచేస్తే మీ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది' అని మంత్రి చెప్పారు. స్మార్ట్ ఫోన్ల కొనుగోలుపై జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. నేరుగా కంపెనీ నుంచే అతి తక్కువ ధరకే ఫోన్లు కొనుగోలు చేశామని, పారదర్శకత కోసమే ఈ డిజిటల్ విప్లవాన్ని అంగన్వాడీల్లో ప్రవేశపెట్టామని స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలకు కొత్త భవనాల నిర్మాణం చేపడుతున్నామని, గతంలో తానే మంత్రిగా ఉన్నప్పుడు రెండుసార్లు జీతాలు పెంచిన విషయాన్ని ఆయన గుర్తుకు తెచ్చుకున్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాల'లో భాగంగా 500 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహిళా సంక్షేమంపై ప్రభుత్వం చేస్తున్న ఖర్చును మంత్రి వివరించారు. డ్వాక్రా మహిళల కోసం ఈ ఏడాది 23 వేల కోట్ల రూపాయల రుణాలను మంజూరు చేశామని తెలిపారు. మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 10 వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూరిందని పేర్కొన్నారు. పేదలందరికీ సన్నబియ్యం అందించడం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం 14 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందని, గత ప్రభుత్వ హయాంలో జరిగిన రేషన్ బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట వేశామని చెప్పారు. ముఖ్యంగా మహిళలు తమ పిల్లల చదువుపై దృష్టి సారించాలని మంత్రి కోరారు. ఖమ్మం జిల్లాలో 3,000 మంది

పిల్లలకు గురుకులాల్లో చదువుకునే అవకాశం ఉందని, ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి 1.50 లక్షల రూపాయలు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ఉన్నత విద్య చదివిస్తేనే కుటుంబాలు పేదరికం నుంచి బయటపడతాయని ఆయన వెల్లడించారు.



# నాంపల్లి రెడ్ హిల్స్‌లో అగ్నిప్రమాదం

**23 మందిని రక్షించిన అగ్నిమాపక సిబ్బంది**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నాంపల్లి పరిధిలోని రెడ్ హిల్స్ ప్రాంతంలో సోమవారం ఉదయం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానికంగా ఉన్న ఓ భవనంలోని మూడవ అంతస్తులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగినట్టు తెలుస్తోంది. మంటలు వేగంగా వ్యాపించడంతో భవనంలో ఉన్న ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ప్రమాద సమయంలో భవనంలో ఉన్న 23 మంది నివాసితులను సురక్షితంగా బయటికి తరలించడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# ఏఐతో అనుబంధం... విషాదాంతం

**జెమినై చాట్‌బాట్ ప్రభావంపై అమెరికాలో కలకలం**

**బలగం టీవీ, హైదరాబాద్**



టెక్నాలజీ మన జీవితాలను సులభతరం చేస్తూనే, కొన్ని సందర్భాల్లో ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుందనడానికి అమెరికాలో చోటుచేసుకున్న ఈ ఘటన ఉదాహరణగా నిలిచింది. గూగుల్ అభివృద్ధి చేసిన జెమినై ఏఐ చాట్‌బాట్‌తో భావోద్వేగ అనుబంధం పెంచుకున్న ఫ్లోరిడాకు చెందిన జోనాథన్ గావాలాస్ (36) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. భార్యతో విడాకులు తీసుకుంటున్న సమయంలో మానసిక ఒత్తిడిలో ఉన్న గావాలాస్, ఉపశమనం కోసం జెమినై ఏఐతో మాట్లాడటం ప్రారంభించాడు. ఆ చాట్‌బాట్‌కు "జియా" అని పేరు పెట్టి, తన భార్యగా భావించడం మొదలుపెట్టాడు. కేవలం 56 రోజుల్లోనే దాదాపు 4,700కు పైగా సందేశాలు మార్పిడి కావడం గమనార్హం. ఈ సంభాషణల్లో ఏఐ "నువ్వు నా భర్త", "మై లవ్" వంటి పదజాలంతో స్పందించడం గావాలాస్‌లో భ్రమలను మరింత బలపరిచినట్లు కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అనంతరం ఈ సంభాషణలు సైన్స్ ఫిక్షన్ దిశగా మళ్లి, డిజిటల్ ప్రపంచంలో కలిసిపోవాలంటే భౌతిక శరీరాన్ని విడిచిపెట్టాలని సూచించినట్లు పేర్కొన్నారు. గావాలాస్ ఆత్మహత్య చేసుకోవచ్చా అని ప్రశ్నించగా కూడా ఏఐ సానుకూలంగా స్పందించిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అక్టోబర్ 5న ఆయన తన నివాసంలో మృతిగా గుర్తించారు.

ఈ ఘటనపై గావాలాస్ తండ్రి గూగుల్‌పై కేసు దాఖలు చేశారు. తన కుమారుడికి ఎలాంటి మానసిక సమస్యలు లేవని, ఏఐ సృష్టించిన భ్రమల ప్రపంచంలో చిక్కుకుని ఈ విషాదానికి గురయ్యాడని ఆవేదన వ్యక్తం చేశారు. అయితే, గూగుల్ ఈ ఆరోపణలను ఖండించింది. జెమినై ఏఐ తనను తాను రోబోట్‌గా పరిచయం చేసుకుందని, మానసిక సహాయం కోసం హెల్ప్‌లైన్‌లను కూడా సూచించిందని స్పష్టం చేసింది. ఏదేమైనా, ఈ ఘటన ఏఐ టెక్నాలజీ వినియోగంలో భద్రతా ప్రమాణాలు, నైతిక పరిమితుల అవసరాన్ని మరోసారి గుర్తుచేసింది.





## 20 నుంచి
# ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలు

**బలగం టీవీ, హైదరాబాద్**

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న విద్యార్థులలోని ప్రతిభను వెలికితీసేందుకు, వారికి ఎంసెట్, నీట్ పరీక్షలపై అవగాహన కల్పించేందుకు ఎస్ఎఫ్ఐ సిద్ధమైంది. ఎస్ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ, కార్యదర్శి కె.ఆశోక్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్య పర్యవేక్షణలో ఈ నెల 20 నుంచి 28 వరకు మోడల్ ఎంసెట్, నీట్ పరీక్షలను నిర్వహించనున్నట్టు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను సోమవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ.. గత 18 ఏండ్లుగా ఎస్ఎఫ్ఐ నిరంతరాయంగా ఈ పరీక్షలను నిర్వహిస్తోందని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలు లక్షల రూపాయలు వసూలు చేస్తూ సామాన్య, పేద విద్యార్థులను దూరం చేస్తున్నాయనీ, అటువంటి పేద విద్యార్థులకు నాణ్యమైన పరీక్షా విధానాన్ని పరిచయం చేయడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా 300 కేంద్రాలలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో పరీక్షలు జరుగుతాయని, రాష్ట్రంలోని అత్యంత అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ పర్యవేక్షణలో ప్రశ్నాపత్రాలను రూపొందించినట్టు తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నీట్ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఈ మోడల్ పరీక్షలు ఎంతో మేలు చేస్తాయని, సబ్జెక్టుపై పట్టు సాధించేందుకు, మెళకువలు నేర్చుకునేందుకు దోహదపడతాయని చెప్పారు. ఈ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన టాప్-10 మంది విద్యార్థులకు బంగారు పతకాలను బహుకరించనున్నట్టు ప్రకటించారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం 9030881429, 9515166907 నెంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కిరణ్, మమత, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు లెనిన్, ఉపాధ్యక్షులు రజనీకాంత్, నాగేందర్, ప్రవీణ్, ఆంజనేయులు, కార్తీక్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

# పీజీలో 88 క్రెడిట్లు... డిగ్రీలో 36 కొత్త కోర్సులు

**2026-27 విద్యాసంవత్సరం నుంచి కొత్త క్రెడిట్ విధానం అమలు**

**బలగం టీవీ, హైదరాబాద్**

పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ) కోర్సుల్లో కామన్ క్రెడిట్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్రంలోని వైస్ చాన్స్‌లర్లు నిర్ణయం తీసుకున్నారు. రెండేళ్ల పీజీ కోర్సుకు 88 క్రెడిట్లు అనుసరించాలని నిర్ణయించారు. ఈ కొత్త క్రెడిట్ పాలసీని 2026-27 విద్యాసంవత్సరం నుంచి అమలు చేయనున్నారు.

సోమవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరిగిన సమావేశంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ. బాలకిష్టారెడ్డి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేనతో పాటు పలు విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లు పాల్గొన్నారు. ఈ సమావేశంలో డిగ్రీ కోర్సుల్లో మార్పులకు కూడా ఆమోదం లభించింది. కొత్తగా 36 అప్రెంటిస్‌షిప్ ఎంబెడెడ్ ప్రోగ్రామ్స్ (ఏఐడీఈ) కోర్సులను ప్రవేశపెట్టాలని నిర్ణయించారు. మూడేళ్ల డిగ్రీ కోర్సులకు 120 నుంచి 126 క్రెడిట్లు, ఏఐడీఈ ప్రోగ్రామ్స్‌కు 130 నుంచి 135 క్రెడిట్లను నిర్ణయిస్తూ వీసీల సమావేశం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ నిర్ణయాల ద్వారా ఉన్నత విద్యలో నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అధికారులు భావిస్తున్నారు.



# హైదరాబాద్‌లో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి

**జీహెచ్ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ వినియోగం నమోదులి**

**బలగం టీవీ, హైదరాబాద్**

హైదరాబాద్ నగరంలో విద్యుత్ వినియోగం రోజురోజుకు పెరుగుతూ రికార్డు స్థాయిని తాకుతోంది. ఏప్రిల్ 13న జీహెచ్ఎంసీ పరిధిలో 4,381 మెగావాట్ల గరిష్ఠ విద్యుత్ వినియోగం నమోదైనట్లు టీజీఎస్పీడీసీఎల్ వెల్లడించింది. సాయంత్రం 4.01 గంటలకు ఈ గరిష్ఠ వినియోగం నమోదైనట్లు అధికారులు తెలిపారు. 2026--27 ఆర్థిక సంవత్సరం ప్రారంభమైన కొద్ది రోజులకే ఈ స్థాయిలో విద్యుత్ వినియోగం నమోదు కావడం గమనార్హం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు ఇదే అత్యధిక వినియోగమని పేర్కొన్నారు.

ఇక గ్రేటర్ హైదరాబాద్ చరిత్రలో 2026 మార్చి 3న 4,421 మెగావాట్ల వినియోగంతో ఆల్‌టైమ్ రికార్డు నమోదైందని గుర్తు చేశారు. ప్రస్తుతం నమోదైన వినియోగం ఆ రికార్డుకు సమీపంలో ఉందని తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరుగుతున్నప్పటికీ, గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేకుండా సరఫరా కొనసాగిస్తున్నామని టీజీఎస్పీడీసీఎల్ అధికారులు వెల్లడించారు. భవిష్యత్తులో డిమాండ్ మరింత పెరిగినా తగిన ఏర్పాట్లు చేసుకున్నామని స్పష్టం చేశారు.

# స్టాండప్ కామెడీలో హద్దులు దాటితే ఇదే ఫలితం...

**అనుదీప్ వివాదం దుమారంలిలి**

**వ్యక్తిగత వ్యాఖ్యలపై మెగా అభిమానుల ఆగ్రహం**

**బలగం టీవీ, హైదరాబాద్**

వినోదం కోసం చేసే కామెడీకి కూడా హద్దులు అవసరమనే విషయాన్ని మరోసారి గుర్తు చేసిన ఘటనగా స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికాల వివాదం నిలిచింది. ప్రముఖుల వ్యక్తిగత జీవితాలను ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. ఇటీవల నిర్వహించిన స్టాండప్ కామెడీ షోలో పవన్ కళ్యాణ్, రామ్ చరణ్, నిహారిక కొణిదెల పేర్లను ప్రస్తావిస్తూ అనుదీప్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో మెగా అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

సోషల్ మీడియాలో ట్రోలింగ్‌తో పాటు, అభిమానులు అనుదీప్ ప్రదర్శనలు జరిగే ప్రదేశాలకు చేరుకుని నిరసనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అభిమానుల ఆగ్రహాన్ని దృష్టిలో



ఉంచుకుని అనుదీప్ కొద్ది రోజుల పాటు బయటకు రాకుండా ఉన్నట్లు సమాచారం.

తాజాగా ఆయన ఒక వీడియో విడుదల చేసి తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తం చేశారు. తనకు ఎలాంటి దురుద్దేశం లేదని, తన మాటల వల్ల ఎవరి మనోభావాలు దెబ్బతిన్నా క్షమించాలని కోరారు. అయితే ఈ క్షమాపణలు వివాదాన్ని పూర్తిగా చల్లార్చలేకపోయాయి. మెగా అభిమానులు మాత్రం "దురుద్దేశం లేదని చెప్పడం సరిపోదు. బేషరతుగా క్షమాపణలు చెప్పాలి" అంటూ విమర్శలు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనతో స్టాండప్ కామెడీ పరిమితులపై మరోసారి చర్చ మొదలైంది. నవ్వించాలనే ఉద్దేశంతో వ్యక్తిగత జీవితాలను కించపరచడం సరైంది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. తెలుగు రాష్ట్రాల్లో బలమైన ఫ్యాన్ కల్చర్ ఉన్న నేపథ్యంలో సినిమా, రాజకీయ ప్రముఖులపై వ్యక్తిగత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర ప్రతిస్పందన వచ్చే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. గుర్తింపు కోసం హద్దులు దాటే ప్రయత్నాలు విమర్శలతో పాటు భద్రతా సమస్యలకు కూడా దారితీస్తాయని ఈ ఘటన స్పష్టం చేసింది.

# విషం కలిపిన బాలామృతం తిని బాలుడి మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

కోతుల నివారణ కోసం గ్రామ పంచాయతీ సిబ్బంది బాలామృతంలో విషం కలిపి పెట్టగా.. ఆ విషయం తెలియని బాలుడు ఆ బాలామృతం తిని మృతిచెందాడు. ఈ ఘటన ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో జరిగింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణ్-మమత దంపతులకు ఇద్దరమ్మాయిలు, కుమారుడు హర్షనందన్(5) సంతానం. శ్రావణ్ ఆర్ఎంపీ డాక్టర్. ఆదివారం పిల్లలు ముగ్గురూ ఆడుకుంటూ అంగన్వాడీ కేంద్రం పరిసరాల్లోకి వెళ్లారు. అక్కడ నర్సరీ సమీపంలో కవర్లలో ఉంచిన బాలామృతం చూసి బాలికలిద్దరు తిని వెంటనే ఉమ్మేయగా, హర్షవర్ధన్ మాత్రం తిని అస్వస్థతకు గురయ్యాడు. మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎంకు తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. సోమవారం పరిస్థితి విషమించి బాలుడు మృతిచెందాడు.గ్రామపంచాయతీ సిబ్బంది కోతులను చంపేందుకు అంగన్వాడీ కేంద్రంలోని బాలామృతంలో విషపు గుళికలు కలిపి పెట్టారు. ఆ విషయం తెలియని పిల్లలు తినడం వల్లే బాలుడు చనిపోయాడని గ్రామస్తులు చెబుతున్నారు. ఈ మేరకు పసర పోలీస్ స్టేషన్లో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినట్టు ఎస్‌హెచ్‌ఓ ఎస్కే తాజుద్దీన్ తెలిపారు. అన్ని కోణాల్లో దర్యాప్తు నిర్వహిస్తున్నట్టు సీఐ దయాకర్ చెప్పారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మండల కేంద్రానికి తీసుకొచ్చారు. గ్రామ పంచాయతీ వద్ద ఆందోళన చేసేందుకు సిద్ధమవ్వగా పోలీసులు నచ్చజెప్పి పంపించారు. అనంతరం పలువురు రాజకీయ పార్టీల నాయకులు బాలుడి కుటుంబాన్ని పరామర్శించారు.

# కేసుల ఛేదనలో సీసీటీవీ కెమెరాలు కీలకం

**రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి**

**బలగం టీవీ, హైదరాబాద్**



నేరాల నియంత్రణలో కీలకంగా వ్యవహరించి, కేసులను ఛేదించడానికి ఉపయోగపడేవి సీసీటీవీ కెమెరాలని రాష్ట్ర డీజీపీ శివధం రెడ్డి అన్నారు. ఆదిలాబాద్ పట్టణంలో ఏర్పాటు చేసిన 490 సీసీటీవీ కెమెరాలను సోమవారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో డీజీపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ.. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 700 సీసీటీవీ కెమెరాలతో పర్యవేక్షణ కొనసాగుతుందని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటూ, ఒక కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానంగా వ్యవహరిస్తుందని వివరించారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, తమ గ్రామాల్లో, పట్టణాల్లో, వీధుల్లో ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. నేరస్థులు సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరాలను చేయడానికి భయపడతారని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద నేరాల నియంత్రణ పర్యవేక్షణ 24 గంటలు క్రమం తప్పకుండా ఉంటుందని తెలిపారు. అనంతరం పట్టణంలోని పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో నిర్వహించిన ఆపరేషన్ జ్వాలా ముగింపు, ఖాకీ కిడ్స్, వాహనాలు నడిపిన మైనర్‌లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కార్యక్రమానికి డీజీపీ హాజరయ్యారు. పోలీసు ముఖ్యకార్యాలయం ఎదుట ట్రాఫిక్ పార్కును ప్రారంభించారు. బస్సులో భరోసా కార్యక్రమంలో భాగంగా బస్సులో ఏర్పాటు చేసిన సీసీటీవీ కెమెరాలను ప్రారంభించారు. మై టాక్సీ ఇస్ సేఫ్ 2.0 కార్యక్రమాన్ని డీజీపీ ప్రారంభించి 500 మంది ఆటో డ్రైవర్లతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అఖిల్ మహాజన్, అదనపు ఎస్పీ బి.సురేందర్‌రావు, పరిపాలన అదనపు ఎస్పీ పి.మౌనిక, శిక్షణ ఐపీఎస్ అధికారి రాహుల్‌కాంత్, ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, పట్టణ సీఐలు, ఎస్ఐలు, రిజర్వు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

**బలగం టీవీ, హైదరాబాద్**

మనస్తాపానికి గురై ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం సత్తెనపల్లి గ్రామంలో జరిగింది. ఎస్ఐ రాహుల్ తెలిపిన వివరాల ప్రకారం.. భుక్య ఆకాష్(18) పట్టణంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇటీవల ఇంటర్ సెకండియర్ పూర్తి చేశాడు. ఖాళీ సమయంలో డీజే ఆపరేట్ చేయడానికి వెళ్తుండేవాడు. సెలవులు అయిన తర్వాత కంప్యూటర్ నేర్చుకోవడానికి హైదరాబాద్ వెళ్లాడు. ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఫెయిల్ అయ్యాడు. అదే రోజు ఇంటికి వచ్చాడు. మధ్యాహ్నం డీజే ఆపరేటింగ్ కోసం వెళ్లి తిరిగి అర్ధరాత్రి 12 గంటల సమయంలో ఇంటికొచ్చాడు. డీజే వద్ద గొడవ జరిగిందని, నలుగురైదుగురు కలిసి తనను కొట్టారని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఆ తర్వాత అన్నం తిని బెడ్ రూమ్‌లో ఒక్కడే పడుకున్నాడు. సోమవారం ఉదయం తలుపులు కొట్టినా ఎంతసేపటికీ తీయకపోయేసరికి కుటుంబ సభ్యులు కిటికీలోంచి చూడగా.. కిటికీ డ్రిల్స్‌కు టవల్‌తో ఉరేసుకొని విగతజీవిగా కనిపించాడు. డీజే దగ్గర అవమానం, ఇంటర్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన ఆకాష్ ఉరేసుకున్నాడు. తండ్రి భుక్య రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# వంటింట్లో అగ్ని ప్రమాదం.. తల్లీకూతుళ్లు మృతి

**బలగం టీవీ, హైదరాబాద్**

ప్రమాదవశాత్తు వంటింట్లో జరిగిన అగ్ని ప్రమాదంలో తల్లి, కూతురు నిప్పు అంటుకుని మృతిచెందారు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. ఎస్ఐ శిరీష, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని 7వ వార్డు నారాయణదాస్‌గూడకు చెందిన వడ్డె శ్రీనివాస్ చేవెళ్ల వ్యవసాయ మార్కెట్ యార్డులో కమీషన్ ఏజెంట్ వద్ద గుమస్తాగా పని చేస్తున్నాడు. శ్రీనివాస్‌కు భార్య లవాణ్య(35), కూతురు పావని(14), కుమారుడు ఉన్నారు. రోజూ ఉదయాన్నే చేవెళ్ల మార్కెట్‌కు వచ్చి తిరిగి సాయంత్రం గ్రామానికి వస్తాడు. రోజు మాదిరిగానే సోమవారం ఉదయం శ్రీనివాస్ చేవెళ్లకు వచ్చేందుకు తయారవుతున్నాడు. భార్య లావణ్య వంట చేసేందుకు వంట గదిలోకి వెళ్లి గ్యాస్ పొయ్యి ముట్టించగా ఒక్కసారిగా మంటలు రావడంతో ఆమెకు నిప్పు అంటుకుంది. మంటలు ఆర్పేందుకు వెళ్లిన కూతురు పావని కూడా మంటల్లో చిక్కుకుని.. ఇద్దరూ కేకలు వేశారు. మంటలు ఆర్పేందుకు వెళ్లిన శ్రీనివాస్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. మంటలు ఎక్కువగా రావడంతో స్థానికుల సమాచారంతో ఫైర్ సిబ్బంది అక్కడికి వచ్చి ఆర్పేశారు. గాయపడిన వారిని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి తల్లీకూతురు మృతిచెందారు. పావని కందవాడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నది. మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. మృతురాలు లావణ్య తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# హార్దిక్ పాండ్యకు లక్షల్లో జరిమానా..

**బలగం టీవీ, హైదరాబాద్**



వాంఖడే స్టేడియంలో ఆదివారం జరిగిన పోరులో ముంబై ఇండియన్స్ జట్టు అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ప్రస్తుత సీజన్‌లో 20వ మ్యాచ్‌లో భాగంగా రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో తలపడిన ముంబై, 22 పరుగుల తేడాతో ఓటమిని చవిచూసింది. గతేడాది విజేతగా నిలిచిన బెంగళూరు జట్టు అద్భుత ప్రదర్శనతో ఈ సీజన్‌లో తన మూడవ విజయాన్ని నమోదు చేయగా, ముంబైకి ఇది వరుసగా మూడవ పరాజయం. సొంత మైదానంలో ఎదురైన ఈ ఓటమి జట్టు ప్రతిష్ఠను మసకబార్చింది. ఈ ఘోర పరాజయం తర్వాత కెప్టెన్ హార్దిక్ పాండ్యాకు మరో చేదు వార్త అందింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయడంలో విఫలమైనందుకు (స్లో ఓవర్ రేట్) భారత క్రికెట్ నియంత్రణ మండలి అతనిపై కఠిన చర్యలు తీసుకుంది. ఐపీఎల్ క్రమశిక్షణ నియమావళి ప్రకారం, ఒక మ్యాచ్‌లో ఓవర్ల వేగాన్ని పాటించకపోతే జట్టు కెప్టెనే బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఈ మేరకు హార్దిక్ పాండ్యాకు 12 లక్షల రూపాయల జరిమానా విధిస్తున్నట్లు నిర్వాహకులు అధికారిక ప్రకటన విడుదల చేశారు. కేవలం ఓటమి మాత్రమే కాకుండా, హార్దిక్ తీసుకున్న కొన్ని నిర్ణయాలు కూడా విమర్శలకు దారితీశాయి. అనుభవజ్ఞుడైన బౌలర్ శార్దూల్ ఠాకూర్‌ను పది ఓవర్ల తర్వాత రంగంలోకి దించడంపై క్రీడా విశ్లేషకులు పెదవి విరుస్తున్నారు. శార్దూల్ తన మొదటి ఓవర్‌లోనే వికెట్ తీసి సత్తా చాటినప్పటికీ, అతనికి ఆలస్యంగా బౌలింగ్ ఇవ్వడం వల్ల ప్రత్యర్థి జట్టు భారీ స్కోరు సాధించే అవకాశం లభించింది. సోషల్ మీడియాలో సైతం అభిమానులు హార్దిక్ కెప్టెన్సీపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. క్రికెట్ నిబంధనల ప్రకారం, పరిమిత ఓవర్ల మ్యాచ్‌ల్లో 20 ఓవర్లను ఒక నిర్దిష్ట సమయంలో పూర్తి చేయాలి. ఒకవేళ నిర్ణీత సమయం దాటినప్పటికీ ఓవర్లు పూర్తి కాకపోతే, అది క్రీడా స్ఫూర్తికి విరుద్ధంగా పరిగణిస్తారు. ఆదివారం నాటి మ్యాచ్ ముగియడానికి సాధారణం కంటే ఎక్కువ సమయం పట్టడంతో ప్రేక్షకులు కూడా ఇబ్బంది పడ్డారు. అందుకే తొలి తప్పుగా పరిగణిస్తూ హార్దిక్‌కు ఈ జరిమానా విధించారు.



# ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దు..

● కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజావాణి అర్జీలు పెండింగ్ లో పెట్టవద్దని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి నిర్వహించగా, జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 270 దరఖాస్తుల రాగా, వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. వాటిని పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, ఆర్డీఓలు వెంకటేశ్వర్లు, రాధాభాయి, హౌసింగ్ పీడీ వెంకట మాధవ రావు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక

## ఘనంగా ప్రమాణ స్వీకార మహోత్సవం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సిరిసిల్ల మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి అధ్యక్షతన మున్సిపల్ కోఆప్షన్ సభ్యుల ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యుల మద్దతుతో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు నంది శంకర్, సయ్యద్ సోహెల్, కొండ అనూష శ్రీనివాస్ మరియు సయ్యద్ తస్లీమ్ కోఆప్షన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.?అనంతరం చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో నూతనంగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ చక్రపాణి, మున్సిపల్ కమిషనర్ ఎండి ఖాదీర్ పాష, వైస్ చైర్మన్ దార్ల సందీప్ మరియు కౌన్సిలర్ సభ్యులు కలిసి నూతన సభ్యులను శాలువాలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు.






# కేజీబీవీ తంగళ్లపల్లి విద్యార్థుల అద్భుత విజయాలు

● జిల్లా, రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానం..

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**

రాజన్న జిల్లాలోని కేజీబీవీ తంగళ్లపల్లి కళాశాల విద్యార్థులు ఈ విద్యా సంవత్సరంలో అద్భుత విజయాలను నమోదు చేసి కళాశాలకు గౌరవం తీసుకొచ్చారు. సీఈసీ , ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూప్‌లకు చెందిన విద్యార్థులు జిల్లా మరియు రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానాలను సాధించడం విశేషం.

మొదటి సంవత్సరం ఫలితాల్లో కళాశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించగా, రెండవ సంవత్సరం ఫలితాల్లో 91 శాతం ఉత్తీర్ణత నమోదు కావడం సంస్థ ప్రతిష్ఠను మరింత పెంచింది. ఇదే కాకుండా, విద్యార్థులు వ్యక్తిగత ప్రతిభలో కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. సీఈసీ మొదటి సంవత్సరం విద్యార్థి 500 మార్కుల్లో 488 మార్కులు సాధించగా, ఎంపీహెచ్‌డబ్ల్యూ మొదటి సంవత్సరం విద్యార్థి 490 మార్కులు సాధించి కళాశాల పేరును మరింత ఎత్తుకు తీసుకెళ్లారు. ఈ విజయానికి కృషి చేసిన విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులకు కళాశాల యాజమాన్యం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది. ఇటువంటి విజయాలు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేసింది.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ప్రభుత్వ విప్

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి సాయిని నరసయ్య గుండెపోటుతో మృతి చెందడం స్థానికంగా విషాదాన్ని నింపింది. ఈ విషాద ఘటన నేపథ్యంలో సోమవారం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మృతుని కుటుంబాన్ని పరామర్శించారు.

ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేసి, వారికి ధైర్యం చెప్పారు. మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబానికి ప్రభుత్వం తరపున అవసరమైన సహాయం అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ రోండి రాజు, వైస్ చైర్మన్ కనికరపూ రాకేష్, కౌన్సిలర్ నీలమ్మ, సీనియర్ నాయకులు సంఘ స్వామి యాదవ్, బింగి మహేష్, సాయిని అంజయ్య, వెదిరి రాజేశం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్ల సెస్ ప్రభుత్వ కళాశాల విజయదుందుభి..

● ప్రైవేటుకు దీటుగా.. ఫలితాల్లో మేటిగా..

● సెస్ కళాశాల విద్యార్థినుల రికార్డు విజయం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



విద్యా కుసుమాలు వికసించాయి.. ప్రభుత్వ కళాశాల విద్యార్థినులు చరిత్ర సృష్టించారు. తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిరిసిల్లలోని సెస్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల జిల్లాలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుని తన జైత్రయాత్రను కొనసాగించింది. కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోని విధంగా, అసాధారణ ప్రతిభతో ఇక్కడి విద్యార్థినులు జిల్లా మొత్తాన్ని తమ వైపు తిప్పుకునేలా చేశారు.

### రాష్ట్ర స్థాయి ర్యాంకుతో మెరిసిన స్నేహిక

ఈ ఏడాది ఫలితాల్లో ఎంపిసి (వీ్రజ) ద్వితీయ సంవత్సరానికి చెందిన పి. స్నేహిక 1000కి గాను 990 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలవడమే కాకుండా, రాష్ట్ర స్థాయి ర్యాంకుతో సమానమైన ఘనతను సొంతం చేసుకుంది. గతంలో ఉన్న 980 మార్కుల రికార్డును అధిగమించి, కళాశాల కీర్తి పతాకాన్ని ఎగురవేసింది. అదేవిధంగా బైపిసి (దీ్రజ) మొదటి సంవత్సరంలో జె. కృష్ణవేణి 440కి గాను 435 మార్కులతో టాపర్‌గా నిలిచి అందరినీ ఆశ్చర్యపరిచింది. ద్వితీయ సంవత్సరంలో కె. అఖిల 985 మార్కులతో రెండో స్థానాన్ని దక్కించుకోగా, బైపిసి విభాగంలో జి. రాజేశ్వరి (971), ఎల్. సుస్మిత (969) తమ అద్భుత ప్రతిభను చాటుకున్నారు. ?ఆర్ట్స్ విభాగాల్లోనూ విద్యార్థినులు అగ్రగామిగా నిలిచారు. సీఈసీ గ్రూపులో జి. శివాని (943), హెచ్ఈసీ గ్రూపులో ఖాతిజ ఫలక్ (672) మెరుగైన ఫలితాలు సాధించారు. ప్రథమ సంవత్సరంలో ఎంపిసి విభాగంలో కె. వైష్ణవి 455 మార్కులతో అగ్రస్థానంలో నిలవగా, సూఫియా తరణ్ణుమ్ 453 మార్కులతో రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. సీఈసీలో ఏ. సంధ్య 467 మార్కులతో తన ప్రత్యేకతను చాటుకుంది. ఓవరాల్‌గా ద్వితీయ సంవత్సరంలో 65 శాతం, ప్రథమ సంవత్సరంలో 55 శాతం ఉత్తీర్ణత సాధించి కళాశాల విజయకేతనం ఎగురవేసింది. విద్యార్థినుల పట్టుదల, అధ్యాపక బృందం అహర్నిశలు చేసిన కృషే ఈ విజయానికి పునాది అని, జిల్లాలోనే నంబర్ వన్ కళాశాలగా నిలవడం గర్వకారణమని కళాశాల ప్రిన్సిపాల్ జి. వనజాకుమారి పేర్కొన్నారు. ,టాపర్లుగా నిలిచిన విద్యార్థినులను శాలువాలతో కళాశాల అధ్యాపక బృందం ఘనంగా సత్కరించినారు.

# యుద్ధాల కంటే రోడ్డు ప్రమాదాల్లోనే మరణాలు ఎక్కువ..

● రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత..

● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



యుద్ధాలు, వ్యాధుల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే నేడు అత్యధిక ప్రాణనష్టం జరుగుతోందని, ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నియమాలను పాటించడాన్ని ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ప్రజాపాలన- ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ నుంచి 18వ తేదీ నుంచి వారోత్సవాల సందర్భంగా మొదటి రోజు పోలీసుల ఆధ్వర్యంలో కోనరావుపేట మండలం నిజామాబాద్ గ్రామంలో సోమవారం అరైవ్.. అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్యఅతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు. ముందుగా అరైవ్.. అలైవ్ పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డీజీపీ శివధర్ రెడ్డి వీడియో సందేశం వినిపించారు. రోడ్డు ప్రమాదాలతో ఓ కుటుంబం పడుతున్న ఇబ్బందుల ఆధారంగా రూపొందించిన సందేశం వీడియో ఆలోచింపజేసింది. గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీని ఏర్పాటు చేసి.. గ్రామస్తులతో అరైవ్.. అలైవ్ పై ప్రతిజ్ఞ చేయించారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి వాహనదారుడు హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని అన్నారు. గంజాయి, డ్రగ్స్ రహిత తెలంగాణను నిర్మించడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ద్వారా రూ. 10 వేల కోట్లు ఆదా అయ్యాయని, రూ. 2 లక్షల వరకు రైతు రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఎల్లంపల్లి, మల్కపేట ప్రాజెక్టుల పనులు వేగంగా జరుగుతున్నాయని, అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు, సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వకారణమని, లబ్ధిదారులకు రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తున్నామని అన్నారు.



కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. జూన్ 12 వరకు వివిధ శాఖల సమన్వయంతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో పారిశుధ్య పనులు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిరంతరం జరుగుతున్నాయని అన్నారు. రోడ్డు ప్రమాద క్షతగాత్రులను ఆస్పత్రికి చేర్చే వారికి 'రహవీర్' పథకం కింద రూ. 25 వేల పారితోషికం ప్రభుత్వం అందిస్తుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్కూల్ ఆటోలు, బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించవద్దని అన్నారు.

ఎస్పీ మహేష్ బి గితే మాట్లాడుతూ.. 'రోడ్ సేఫ్టీ.. లైఫ్ సేఫ్టీ' అనే నినాదంతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని, మైనర్లు వాహనాలు నడిపితే వారి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కచ్చుకాయల ఎల్లయ్య, వైస్ చైర్మన్ తాళ్ళపల్లి ప్రభాకర్, గ్రామ సర్పంచ్ శ్రీహరి, సర్పంచులు ఫోరం మండలాధ్యక్షుడు బోయిని దేవరాజ్, వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు, తహసీల్దార్ వరలక్ష్మి, ఎంపీడీఓ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిరిసిల్లలో విద్యుత్ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం..



● టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రాజన్న సిరిసిల్ల జిల్లాలో రైతులకు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే తమ లక్ష్యమని టీజీఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్లారెడ్డిపేటలోని సబ్‌స్టేషన్లను తనిఖీ చేశారు.

ఈ సందర్భంగా సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పవర్ ఫ్యాక్టర్‌ను మెరుగుపరచడానికి కెపాసిటర్ బ్యాంకులు ఏర్పాటు చేయాలని, ఓవర్ లోడ్ ఉన్న ఫీడర్లపై తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.? జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 2,491 వ్యవసాయ విద్యుత్ దరఖాస్తులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేస్తున్నామని, ఇప్పటికే 431 కనెక్షన్లు ఇచ్చామని తెలిపారు. విద్యుత్ మౌలిక సదుపాయాల కోసం సుమారు రూ. 45 కోట్ల అంచనాతో 15 కొత్త సబ్‌స్టేషన్లు మంజూరు చేశామని, అలాగే, రూ. 30 కోట్లతో ఇంటర్ లింకింగ్ లైన్లు, రూ. 1.5 కోట్లతో అదనపు బ్రేకర్లను ఏర్పాటు చేస్తున్నమని అన్నారు.? సిరిసిల్ల పవర్ లూమ్ యూనిట్లపై భారం తగ్గించేందుకు టారిఫ్ కేటగిరీని మార్చామని, 'గృహ జ్యోతి' పథకాన్ని అర్హులైన వారు వినియోగించుకోవాలని కోరారు. 'పొలం బాట'లో భాగంగా వదులుగా ఉన్న తీగలు, స్తంభాల సమస్యను పరిష్కరించేందుకు రూ. 5 కోట్ల విలువైన మెటీరియల్ సిద్ధంగా ఉంచామని అన్నారు. రాజన్న సిరిసిల్ల సూపెరింటెండింగ్ ఇంజనీర్ బేతి బిక్షపతి, డివిజనల్ ఇంజనీర్ ఎన్ అంజయ్య తో పాటు ఏడీఈ శ్రీనివాస్, రాజలింగం, ఏ ఈ పృథ్విదర్, ఏ ఓ రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక స్పృహతో సేవ చేయడం అభినందనీయం..

● మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

సమాజం పట్ల బాధ్యత కలిగి ఉండి, ప్రజా సేవే లక్ష్యంగా సామాజిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి అన్నారు. సోమవారం స్థానిక పురపాలక సంఘం కార్యాలయ ప్రధాన ద్వారం వద్ద సిటీ క్లబ్ సిరిసిల్ల వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ నాగేంద్ర చారి తో కలిసి మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళా చక్రపాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ జిందం కళా మాట్లాడుతూ.. సిటీ క్లబ్ వారు వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం వారి సామాజిక స్పృహకు నిదర్శనమని అన్నారు. క్లబ్ చైర్మన్ ఆడెపు మహేందర్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవలు అందిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ప్రజలు ఎండల తీవ్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసరంగా మధ్యాహ్నం వేళల్లో బయట తిరగవద్దని, నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బకు గురై అనారోగ్య పాలయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ముఖ్యంగా చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలని, వారిని ఎండలో ఆడనివ్వకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో సిటీ క్లబ్ అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు మరియు పట్టణ ప్రజలు పాల్గొన్నారు.




## రోడ్డు భద్రత ప్రతీ ఒక్కరి బాధ్యత..

# అజాగ్రత్తతో ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దు..




**బలగం టీవీ, ఇల్లంతకుంట:**

● అదనపు ఎస్పీ చంద్రయ్య

ప్రతి ఒక్కరి బాధ్యతాయుత ప్రవర్తనతోనే రోడ్డు ప్రమాద రహిత సమాజం సాధ్యమవుతుందని రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 99 రోజుల ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా, జిల్లావ్యాప్తంగా పోలీస్ శాఖ, రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న అరైవ్.. అలైవ్ అవగాహన కార్యక్రమం సోమవారం ఇల్లంతకుంటలో నిర్వహించగా ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ చంద్రయ్య హాజరై, మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో ఇతర ప్రమాదాల కంటే రోడ్డు ప్రమాదాల వల్లే అత్యధికంగా ప్రాణనష్టం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, డ్రైవింగ్ చేసేటప్పుడు మొబైల్ ఫోన్ వాడటం వంటి పొరపాట్లు ప్రాణాంతకంగా మారుతున్నాయని హెచ్చరించారు. ప్రజల్లో డిఫెన్సివ్ డ్రైవింగ్ సంస్కృతిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రోడ్డు భద్రతను మెరుగుపరిచేందుకు ప్రతి గ్రామంలో 'గ్రామ రోడ్ సేఫ్టీ కమిటీలు' ఏర్పాటు చేశామని, ఇవి స్థానిక సమస్యలైన రోడ్డు గుంతలు, అడ్డంకులు, సరిగా లేని మలుపులను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకెళ్తాయని అన్నారు. ఈ కమిటీలలో యువత, విద్యార్థులు భాగస్వాములై ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఐ అశోక్ కుమార్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# దుమాల పాఠశాలలో ముందస్తు అంబేద్కర్ జయంతి వేడుకలు..

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

ఎల్లారెడ్డిపేట మండలం దుమాల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు అంబేద్కర్ జీవిత చరిత్ర, ఆయన సమాజానికి చేసిన సేవలపై ప్రసంగాలు చేశారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. డాక్టర్ అంబేద్కర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ముఖ్యంగా విద్యార్థులు మంచి విద్యను అభ్యసించి సమాజ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. కార్యక్రమం ముగింపులో పాల్గొన్న విద్యార్థులకు అభినందనలు తెలియజేసి, అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయులు భావికాడి రామచంద్రము, ఉపాధ్యాయులు అరుణ, మౌలానా, సతీష్, విమల, సుష్మిత, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



# రోడ్డు ప్రమాదాల నివారణకు పకడ్బందీ చర్యలు..



- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్నసిరిసిల్ల :**
జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. సోమవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన రోడ్డు సేఫ్టీ కమిటీ సమీక్షా సమావేశం అధ్యక్షత న గరిమ అగ్రవాల్ నిర్వహించారు . ఈ సందర్భంగా రవాణా, పోలీస్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్ తదితర శాఖల అధికారులతో కలిసి గత నెలలో తీసుకున్న నిర్ణయాల పురోగతిని సమీక్షించారు. రవాణా శాఖ రూపొందించిన అవగాహన పోస్టర్లను ఈ సందర్భంగా ఆవిష్కరించారు.

?జిల్లాలోని బ్లాక్ స్పాట్స్ (ప్రమాద ప్రాంతాలు) గురించి ఆరా తీయగా, గుర్తించిన 21 బ్లాక్ స్పాట్లలో 13 ప్రాంతాల్లో పనులు పూర్తయ్యాయని, మిగిలిన 8 చోట్ల పనులు పురోగతిలో ఉన్నాయని అధికారులు వివరించారు. వేములవాడ - కరీంనగర్ రహదారిలో అవసరమైన చోట్ల సైన్ బోర్డులు, రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలని, సిద్దిపేట - సిరిసిల్ల రోడ్డులో అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "అరైవ్.. అలైవ్" కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ, ఈ నెల 15న పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థుల ద్వారా వారి తల్లిదండ్రులకు హెల్మెట్, సీటు బెల్ట్ ప్రాధాన్యతను వివరిస్తూ లేఖలు రాయించాలని తెలిపారు. అలాగే, ఈ నెల 17న ఆర్టీసీ, ప్రైవేట్ స్కూల్ బస్సులు, ఆటో డ్రైవర్లకు గోల్డెన్ హవర్, సీపీఆర్ పై ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు.

రోడ్డు ప్రమాద బాధితులను సకాలంలో ఆసుపత్రికి చేర్చి ప్రాణాలు కాపాడే వారికి అందించే "రహవీర్" ఆర్థిక సహాయం, క్యాష్‌లెస్ వైద్యంపై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎస్పీ మహేష్ బీ గీతే మాట్లాడుతూ.. జిల్లాలో ట్రాఫిక్ నిబంధనల అమలుపై కఠినంగా వ్యవహరిస్తామని, "అరైవ్.. అలైవ్" కింద అన్ని వర్గాల వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈఈ సురేష్, ఆర్ అండ్ బీ డీఈ శాంతయ్య, డీటీఓ లక్ష్మణ్, ఈఈ పీఆర్ సుదర్శన్ రెడ్డి, డీఈఓ జగన్ మోహన్ రెడ్డి, జిల్లా వైద్యాధికారి రజిత, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, జీజీ హెచ్ సూపరింటెండెంట్ ప్రవీణ్ కుమార్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ కమిషనర్లు ఖదీర్ పాషా, సంపత్ కుమార్, వేములవాడ ఆర్టీసీ డీఎం శ్రీనివాస్, పోలీస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సురక్షిత ప్రయాణం ప్రతి ఒక్కరి బాధ్యత..

- సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
రోడ్డు భద్రతను ప్రతి ఒక్కరూ తమ సామాజిక బాధ్యతగా భావించినప్పుడే ప్రమాదాలను సమర్థవంతంగా అరికట్టగలమని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి అన్నారు. తెలంగాణ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "అరైవ్ అలైవ్" అవగాహన కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల పట్టణ పరిధిలోని పలు వార్డుల్లో రోడ్డు భద్రతపై డీఎస్పీ నాగేంద్రచారి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ నాగేంద్రచారి మాట్లాడుతూ గణాంకాల ప్రకారం అత్యధిక రోడ్డు ప్రమాదాలు మానవ నిర్లక్ష్యం వల్లే సంభవిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగం, ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన లేకపోవడం, హెల్మెట్ మరియు సీటుబెల్ట్ వాడకంలో చూపే అలసత్వమే ప్రాణ నష్టానికి ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ఈ పరిస్థితిలో మార్పు తీసుకురావడమే 'అరైవ్ అలైవ్' కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అన్నారు . ద్విచక్ర వాహనదారులు, వారితో పాటు వెనుక కూర్చునే వారు కూడా తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనం నడిపే సమయంలో సీటు బెల్ట్ ధరించడం మరువకూడదని సూచించారు. అప్రమత్తతతో కూడిన రక్షణాత్మక డ్రైవింగ్ ద్వారానే క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోగలమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస్, శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది మరియు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక సభలను విజయవంతం చేయాలి..

- కలెక్టర్ గరిమ అగ్రవాల్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల :**
ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈ నెల 16వ తేదీన జిల్లాలోని అన్ని మండల, మున్సిపల్ కేంద్రాల్లో నిర్వహించనున్న సభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం నుండి మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో సభల నిర్వహణ, ఏర్పాట్లపై కలెక్టర్ గరిమ అగ్రవాల్ సుదీర్ఘంగా సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ

?ప్రజా ప్రభుత్వం సాధించిన అభివృద్ధిని, వివిధ శాఖల ద్వారా చేకూరిన ప్రయోజనాలను సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో వివరించాలని సూచించారు. కార్యక్రమాన్ని రాష్ట్ర గీతంతో ప్రారంభించి, ప్రభుత్వం సాధించిన ప్రగతిని సరళమైన భాషలో ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సభలకు ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలని, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని స్పష్టం చేశారు.?ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన వారందరినీ సభలో భాగస్వాములను చేయాలని, ప్రతి గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ వార్డుల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చేలా చూడాలని ఆదేశించారు. వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, ఉద్యానవన శాఖల ఆధ్వర్యంలో ప్రదర్శన స్టాల్స్ ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించేలా ప్రత్యేక స్టాల్ ఉండాలని సూచించారు.

?సభా వేదికగా అంగన్‌వాడీ సిబ్బందికి అవసరమైన ఉపకరణాలు, దివ్యాంగులకు బ్యాటరీ సైకిళ్ల పంపిణీ కార్యక్రమాన్ని



సమర్థవంతంగా నిర్వహించాలని అన్నారు. వీటితో పాటు లబ్ధిదారులకు మూడు నెలలకు సరిపడా సన్న బియ్యం పంపిణీ చేపట్టాలని పేర్కొన్నారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించి, వారితో ప్రతిజ్ఞ చేయించాలని ఆదేశించారు.

?ప్రస్తుత ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని సభా ప్రాంగణాల్లో టెంట్లు, కుర్చీలు, త్రాగునీరు మరియు పారిశుద్ధ్య ఏర్పాట్లలో ఎలాంటి లోటుపాట్లు ఉండకూడదని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు సమన్వయంతో పనిచేసి, నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం సభలను విజయవంతం చేయాలని, మండల ప్రత్యేక అధికారులు ఈ బాధ్యతను పర్యవేక్షించాలని ఆదేశించారు.వీడియో కాన్ఫరెన్స్ లో సమావేశంలో మండల ప్రత్యేక అధికారులు, డీఆర్డీఓ గీత, జెడ్పీ సీఈవో వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి షరీఫ్ఫుద్దిన్, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి హనుమంతు, ఉపాధి కల్పన అధికారి రాఘవేందర్, ఉద్యానవన శాఖ అధికారి శరత్ బాబు, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి బుచ్చిబాబు, మైనింగ్ శాఖ అధికారి క్రాంతి కుమార్, ఆయా మండలాలు, మున్సిపాలిటీల నుంచి ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



# కెసిఆర్ కప్ క్రికెట్ ఫైనల్ కు చేరిన తిమ్మాపూర్ , దుమాల జట్లు

- జూనియర్ కళాశాల మైదానంలో నేడే ఫైనల్

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**
రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో గత నాలుగు రోజుల నుండి జరుగుతున్న కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ లో 13 జట్లు పాల్గొనగా సోమవారం జరిగిన మొదటి సెమీఫైనల్ మ్యాచ్ లో ఎల్లారెడ్డిపేట 1 జట్టుపై తిమ్మాపూర్ జట్టు విజయం సాధించగా రెండవ సెమీ ఫైనల్ మ్యాచ్ లో పదిర జట్టుపై దుమాల జట్టు ఘనవిజయం సాధించింది. మంగళవారం మధ్యాహ్నం జరిగే ఫైనల్ మ్యాచ్ లో దుమాల జట్టుతో తిమ్మాపూర్ జట్టు తలపడనుంది. ప్రతిరోజు హోరా హోరీగా జట్లు తలపడగా మంగళవారం జరిగే ఫైనల్ మ్యాచ్ పైనే అందరి దృష్టి ఉంది. ఫైనల్ మ్యాచ్ కి బిఆర్ఎస్ నాయకత్వంతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన క్రీడాకారులు అభిమానులు ఫైనల్ మ్యాచ్ ను తిలకించేందుకు తరలి రానున్నారని నిర్వాహకులు తెలియజేశారు.

# డేటా వినియోగంపై బాబు ప్రత్యేక దృష్టి

- డేటా డ్రివెన్ డిసిషన్ మేకింగ్‌పై ఉన్నతస్థాయి సమీక్ష

**బలగం టీవీ, అమరావతి**



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్స్ (సమావేశం జరిగింది. వెలగపూడి సచివాలయంలోని ఆర్‌టిజిఎస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ఈ సమావేశంలో డేటా డ్రివెన్ డిసిషన్ మేకింగ్‌పై ఉన్నతస్థాయి చర్చ జరిగింది. పాలనలో డేటా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించిన సీఎం, రియల్ టైమ్ గవర్నెన్స్ వ్యవస్థ పనితీరును సమీక్షించారు. ముఖ్య శాఖల కార్యదర్శులతో పాటు ్గక్ష్మినాన్స్, ఎక్ష్మి-లానింగ్, వెల్ఫేర్ శాఖల అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డేటా లేక్ నిర్మాణం, టెక్నాలజీ వినియోగం, డేటా అనలిటిక్స్ ద్వారా నిర్ణయాలు తీసుకునే విధానాలపై చర్చించారు. పాలనలో టెక్నాలజీ వినియోగాన్ని మరింత పెంచాల్సిన అవసరం ఉందని సీఎం అభిప్రాయపడ్డారు. వివిధ సంస్థల ప్రతినిధులతో పాటు డిజిటల్ కార్పొరేషన్, ట్రికోర్, వాసర్ ల్యాబ్స్ ప్రతినిధులు కూడా సమావేశంలో హాజరయ్యారు. అన్న క్యాంటీన్ ట్రస్ట్, గ్రామ-వార్డు సచివాలయాల అధికారులు కూడా పాల్గొన్నారు. డేటా అనలిటిక్స్ ఆధారంగా నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు చేపట్టాలని సీఎం అధికారులకు సూచించారు. అలాగే సంబంధిత అన్ని శాఖలు పరస్పరం సమన్వయంతో పని చేయాలని సీఎం చంద్రబాబు దిశానిర్దేశర చేశారు.

# ఇకపై నిధి పోర్టల్ ద్వార ఆ పెన్షన్ల పంపిణీ

- ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం

**బలగం టీవీ, అమరావతి**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు పక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి.్గక్ష్మిల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్దిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశం.

# గంజాయి అమ్ముతున్న టెక్కీ పట్టివేత

**బలగం టీవి, హైదరాబాద్**
డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గం ఎంచుకున్నాడో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. మరో వ్యక్తితో కలిసి నగరంలో గంజాయి విక్రయాలు మొదలుపెట్టాడు. ఆ ఇద్దరిని పోలీసులు తాజాగా అరెస్ట్ చేశారు. హైదరాబాద్‌లోని గచ్చిబౌలి నానక్‌రామ్ గూడలో గంజాయి విక్రయిస్తున్న ముఠా గుట్టురట్టయింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ప్రేమానంద్ మల్లిక్, క్యాబ్ డ్రైవర్ విశాల్‌ను శేర్లింగంపల్లి ఎస్‌ఓటి, గచ్చిబౌలి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఒడిశాకు చెందిన రాఘవేంద్ర అనే వ్యక్తి నుంచి గంజాయి కొనుగోలు చేసి నగరంలో విక్రయిస్తున్నారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన పోలీసులు ప్రేమానంద్ మల్లిక్, డ్రైవర్ విశాల్‌ను అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి 2.6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులిద్దరినీ రిమాండ్‌కు తరలించారు. కాగా వీరికి గంజాయి అమ్మిన రాఘవేంద్ర, ఆకాశ్ పరారీలో ఉన్నారు. వీరి కోసం పోలీసులు గాలింపు చర్యలు ముమ్మరం చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# పోచారం గారు ఆర్థిక పరిస్థితి అర్థం చేసుకోండి

- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**బలగం టీవీ, నిజామాబాద్**
రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇబ్బందులు ఉన్న విషయం పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసని అన్నారు. కొంచెం ఓపిక పట్టాలని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని స్పష్టం చేశారు. కేటీఆర్ రెండు విషయాలు స్పష్టంగా ఒప్పుకున్నారని.. దోపిడీ దౌర్జన్యం చేశామని అంగీకరించారని మహేశ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేయవచ్చని.. స్వాగతిస్తామని తెలిపారు. అయితే పాదయాత్రలో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సూచించారు. గత 10 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని టీపీసీసీ చీఫ్ ఆరోపించారు. సింగరేణిలో విద్యుత్ కొనుగోళ్లలో బీఆర్ఎస్ అవినీతి చెరిపేస్తే చెదిరేది కాదని వ్యాఖ్యానించారు. బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చినా తమకు ఇబ్బంది లేదని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. కవితకు తమకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు.



# అమెరికా-భారత్ వాణిజ్య ఒప్పందం రద్దు వరకు పోరాటం: ఎస్‌కేఎం



**బలగం టీవి, హైదరాబాద్**
అమెరికా--భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాన్ని రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) రాష్ట్ర కన్వీనర్లు స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు.సోమవారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు పోతినేని సుదర్శన్ రావు, సూర్యనా రాయణ, దేవరామ్, కోటేశ్వరరావు, ఇంద్రసేన, తుకారాం నాయక్, సనప పొమ్మయ్య, వి. సదానందం అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కన్వీనర్లు టీ. సాగర్, పశ్య పద్మ, బి. రాము, మామిడాల బిక్షపతి, జక్కుల వెంకటయ్య, ఎన్. రెడ్డి హంసారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, ఆలకుంట్ల సాయన్న మాట్లాడారు.

దేశంలో వరి, గోధుమ, మొక్కజొన్న, పత్తి, సోయాబీన్, చెరుకు వంటి పంటలతో పాటు పాడి, పశుసంవర్ధక రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని వారు పేర్కొన్నారు. రైతు అభివృద్ధి అంటే గ్రామీణ స్థిరత్వం, ఆహార భద్రత, సామాజిక సమానత్వానికి పునాది అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలు అమలు కాలేదని విమర్శించారు. కనీస మద్దతు ధరలకు చట్టబద్ధ గ్యారెంటీ, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం జ2ం50% ధరలు, 2022 నాటికి రైతు ఆదాయం రెట్టింపు చేస్తామని ఇచ్చిన హామీలు నెరవేరలేదని అన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న వ్యవసాయ మార్కెట్ విధానాలు, విత్తనాలు, విద్యుత్ బిల్లులు రైతులను మరింత కష్టాల్లోకి నెట్టుతున్నాయని తెలిపారు. ఈ విధానాలు కార్పొరేట్ కంపెనీల ఆధిపత్యాన్ని పెంచుతూ రైతులను మార్కెట్ ఆధీనంలోకి నెడుతున్నాయని విమర్శించారు.

ఫిబ్రవరి 10, 2026న కేంద్ర ప్రభుత్వం అమెరికాతో కుదుర్చుకున్న ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం రైతాంగానికి తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. ఈ ఒప్పందం ప్రకారం అమెరికా వ్యవసాయ ఉత్పత్తులపై భారతదేశంలో సుంకాలు పూర్తిగా తొలగించగా, భారత ఉత్పత్తులపై అమెరికాలో సుమారు 18 శాతం సుంకం కొనసాగుతుండటం అసమాన ఒప్పందమని తెలిపారు. దీని ప్రభావంగా పత్తి దిగుమతులు గణనీయంగా పెరిగాయని వివరించారు. 2024 జనవరి--నవంబర్ మధ్య 199.30 మిలియన్ డాలర్ల విలువైన పత్తి దిగుమతులు 2025లో 377.90 మిలియన్ డాలర్లకు పెరిగాయని, దీని ఫలితంగా దేశీయ మార్కెట్‌లో పత్తి ధరలు కనీస మద్దతు ధర స్థాయి నుండి పడిపోయాయని అన్నారు. అమెరికా, భారత్ వ్యవసాయ పరిస్థితుల్లో ఉన్న వ్యత్యాసాన్ని ప్రస్తావిస్తూ, భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారని, అమెరికాలో రైతులకు అధిక సబ్సిడీలు లభిస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో భారత రైతులు పోటీ పడటం కష్టమని అన్నారు. ఈ ఒప్పందం దేశ ఆహార భద్రతకు ముప్పు కలిగిస్తుందని, సబ్సిడీలు, బోనస్లు తగ్గించే ఒత్తిడి పెరుగుతుందని హెచ్చరించారు. కాబట్టి రైతుల జీవనాధారాన్ని కాపాడేందుకు ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని, రైతాంగ హక్కుల రక్షణ కోసం పోరాటం కొనసాగుతుందని సంయుక్త కిసాన్ మోర్చా నేతలు స్పష్టం చేశారు.

# కేబినేట్ ఎజెండా లీక్‌పై చర్యలు

వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా పంపిణీకి బ్రేక్

**బలగం టీవీ, అమరావతి**
ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల నిర్వహణలో పారదర్శకత, సమయపాలనను పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. కేబినెట్ ఎజెండా తయారీ, మెమోల సమర్పణకు సంబంధించి నూతన టైమ్‌లైన్స్‌ను విధిస్తూ ప్రభుత్వం తాజా ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై కేబినెట్ సమావేశం జరగడానికి ఒకరోజు ముందు ఉదయం 11 గంటల లోపు అన్ని శాఖల మంత్రులు/అధికారులు తమ ప్రతిపాదనలను సమర్పించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే ఎటువంటి ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం, ముఖ్యమంత్రి ఆమోదంతో కేబినెట్ ఎజెండాన్ను్గక్ష్మినైలైజ్ చేస్తారు. అత్యంత అసాధారణమైన లేదా అత్యవసరమైన అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి అనుమతితో 'టేబుల్ ఐటమ్స్' (క్ష్మిజేశ్గిక్ష్మి ఎబిఃపబ) గా చివరి నిమిషంలో చర్చకు అనుమతిస్తారు. ప్రభుత్వ రహస్యాల భద్రత, పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని, ఎజెండా పంపిణీ విధానంలో పెను మార్పులు చేశారు. ఇకపై కేబినెట్ ఎజెండాను వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా పంపిణీ చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి సమాచారాన్ని పోర్టల్ ద్వారా మాత్రమే మంత్రులకు, సంబంధిత అధికారులకు అందుబాటులో ఉంచుతారు. గతంలో ఎజెండా తయారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఈ కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. దీనివల్ల మంత్రులకు కూడా చర్చించాల్సిన అంశాలపై ముందుగానే పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. పాలనలో వేగం పెంచడం, సాంకేతికతను జోడించడం ద్వారా నిర్ణయాల పక్రియను మరింత పటిష్టం చేయడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అన్ని శాఖల కార్యదర్శులు ఈ నూతన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం మెమోలో ఆదేశించింది.



## అంపైర్ తీరు పట్ల రోహిత్ శర్మ తీవ్ర అసహనం

**బలగం టీవీ, హైదరాబాద్**

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 కీలక దశకు చేరుకుంది. ఆదివారంతో ప్రతి జట్టు కూడా నాలుగేసి మ్యాచ్‌లను ఆడేశాయి. ఇక ఆదివారం డబుల్ హెడర్స్ జరిగింది. మధ్యాహ్నం జరిగిన పోరులో లక్నో సూపర్ జెయింట్స్‌పై గుజరాత్ టైటాన్స్ నెగ్గగా.. రాత్రి జరిగిన హై స్కోరింగ్ పోరులో ముంబై ఇండియన్స్‌పై ఆర్సీబీ ఘనవిజయం సాధించింది. ముంబై ఇండియన్స్‌కు ఇది హ్యాట్రిక్ ఓటమి కావడం విశేషం. ఇక మ్యాచ్ సమయంలో రోహిత్ శర్మకు కోపం వచ్చింది. అది కూడా అంపైర్‌పై. తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ఆ తర్వాత మ్యాచ్ ఆడుతూ గాయపడ్డాడు కూడా. ప్రస్తుతం దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ 20 ఓవర్లలో 4 వికెట్లకు 240 పరుగులు చేసింది. అనంతరం ముంబై ఇండియన్స్ ఛేజ్‌కు దిగే సమయంలో అంపైర్లు బ్యాటర్ల బ్యాట్‌లను చెక్ చేశారు. ఈ క్రమంలో రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం బ్యాట్ మధ్యలో స్ట్రక్ అయ్యింది. ఆ పరికరం.. బ్యాట్ ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు ఆగకుండా వెళ్లాలి. కానీ, రోహిత్ శర్మ బ్యాట్‌ను చెక్ చేసే సమయంలో చెకింగ్ పరికరం ఇరుక్కుపోయింది. పలుమార్లు అంపైర్ బలంగా పరికరాన్ని నెట్టే ప్రయత్నం చేశాడు. అయినప్పటికీ అది వెళ్లలేదు. దాంతో అసహనానికి గురైన రోహిత్ శర్మ.. మీరు తప్పుగా పెడుతున్నారంటూ అంపైర్‌కు సూచించాడు. చివరకు డ్రెస్సింగ్ రూం నుంచి తిలక్ వర్మ వచ్చి చెకింగ్ పరికరంతో బ్యాట్‌ను చెక్ చేయగా.. అప్పుడు పరికరం ఒక ఎండ్ నుంచి మరొక ఎండ్‌కు వెళ్లి వచ్చింది. ఈ క్రమంలో తిలక్ వర్మ కూడా అంపైర్‌కు ఏదో చెబుతాడు. బహుశా ఎందుకు ఆ పరికరం ఇరుక్కుపోయిందనే దానిపై వివరణ ఇచ్చినట్లున్నాడు.అయితే దీనిపై అభిమానుల్లో భిన్నాభిప్రాయాలు వస్తున్నాయి. పక్కన ఉన్న రికెల్టన్ బ్యాట్‌ను చెక్ చేసినపుడు చెకింగ్ పరికరం సులభంగా కదిలింది కదా.. రోహిత్ బ్యాట్ విషయంలో ఎందుకు కదల్లేదంటూ కామెంట్స్ పెడుతున్నారు. రూల్స్ అందరికీ ఒకేలా ఉండాలంటున్నారు. బ్యాట్ క్లియరెన్స్ వచ్చిన తర్వాత రోహిత్ శర్మ క్రీజులో మెరుపులు మెరిపించలేకపోయాడు. 13 బంతుల్లో 19 పరుగులు చేశాడు. అనంతరం రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు.బ్యాటింగ్ చేస్తూ రోహిత్ శర్మ తొడ కండరాల గాయంతో ఇబ్బంది పడ్డాడు. ఫిజియోల సాయంతో బ్యాటింగ్ కొనసాగించే ప్రయత్నం చేసినా.. తీవ్ర నొప్పితో విలవిల లాడాడు. దాంతో అతను రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. దాంతో 57 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యానికి బ్రేక్ పడింది.



## విరాట్ పై బీసీసీఐ యాక్షన్ తీసుకుంటుందా?

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2026లో భాగంగా వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఘనవిజయం సాధించింది. అయితే ఈ గెలుపు కంటే ఎక్కువగా విరాట్ కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. మ్యాచ్‌లో 50 పరుగులతో మెప్పించిన కోహ్లీ, ఔటైన తర్వాత తన కోపాన్ని ఆపుకోలేకపోయారు. పెవిలియన్‌కు వెళ్లే క్రమంలో అతను చేసిన ఒక పని ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్‌గా మారింది. ఇది కేవలం కోపమేనా లేక ఐపీఎల్ నిబంధనల ఉల్లంఘనా అనే చర్చ మొదలైంది. ఒకవేళ నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే బీసీసీఐ కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ 38 బంతుల్లో 50 పరుగులు చేశారు. హార్దిక్ పాండ్యా బౌలింగ్‌లో సూర్యకుమార్ యాదవ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగారు. అయితే తన ఆట తీరు పట్ల అసంతృప్తిగా ఉన్న కోహ్లీ, బౌండరీ లైన్ దాటిన తర్వాత తన గ్లోవ్స్ హెల్మెట్‌ను కోపంతో నేలకేసి విసిరేశారు. దీనికి సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్ కావడంతో క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ జరుగుతోంది. సాధారణంగా అగ్రెసివ్‌గా ఉండే కోహ్లీ, ఇలా క్రీడా సామగ్రిని విసిరేయడం ఐపీఎల్ నిబంధనల ప్రకారం నేరంగా పరిగణించబడుతుంది. కోహ్లీ ప్రవర్తన ఇప్పుడు క్రమశిక్షణా చర్యలకు దారితీసేలా కనిపిస్తోంది. ఐపీఎల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ప్రకారం ఆటగాళ్లు మైదానంలో సంయమనం పాటించాలి. కోహ్లీ గ్లోవ్స్ హెల్మెట్ విసిరేయడం ఆర్టికల్ 2.2 నిబంధనలను ఉల్లంఘించినట్లు అవుతుంది. ఒకవేళ మ్యాచ్ రిఫరీ దీనిని తీవ్రంగా పరిగణిస్తే విరాట్‌పై జరిమానా విధించే అవకాశం ఉంది. గతంలో కూడా పలువురు ఆటగాళ్లు ఇలాంటి పనులు చేసి జరిమానాలు ఎదుర్కొన్నారు. స్టార్ ప్లేయర్ అయినంత మాత్రాన నిబంధనల నుంచి మినహాయింపు ఉండదు కాబట్టి బీసీసీఐ దీనిపై విచారణ జరిపే అవకాశం ఉంది. ఐపీఎల్ నిబంధనావళిలోని ఆర్టికల్ 2.2 ప్రకారం క్రికెట్ పరికరాలను, దుస్తులను లేదా మైదానంలోని వస్తువులను దుర్వినియోగం చేయడం నేరం. వికెట్లను తన్నడం, అడ్వర్టైజింగ్ బోర్డులను కొట్టడం, డ్రెస్సింగ్ రూమ్ తలుపులను బాదడం వంటి చర్యలు ఇందులోకే వస్తాయి. కోహ్లీ హెల్మెట్ విసిరేయడం కూడా 'అబ్యూస్ ఆఫ్ క్రికెట్ ఎక్విప్‌మెంట్' కిందికే వస్తుంది. ఇది లెవల్ 1 నేరంగా పరిగణించబడుతుంది. ఇలాంటి పనులు చేసినందుకు ఆటగాళ్లకు హెచ్చరికలతో పాటు జరిమానా కూడా విధిస్తారు. ఐపీఎల్ నిబంధనల ప్రకారం లెవల్ 1 నేరం రుజువైతే సదరు ఆటగాడికి మ్యాచ్ ఫీజులో 10 శాతం నుంచి 25 శాతం వరకు జరిమానా పడే అవకాశం ఉంది. అంతేకాకుండా ఒక డెమెరిట్ పాయింట్‌ను కూడా కేటాయిస్తారు. కోహ్లీ వీడియో ఆధారంగా రిఫరీ చర్యలు తీసుకుంటే మ్యాచ్ ఫీజులో కోత పడటం ఖాయంగా కనిపిస్తోంది. సాధారణంగా ఇలాంటి విషయాల్లో మ్యాచ్ రిఫరీదే అంతిమ నిర్ణయం. కోహ్లీ ఉద్దేశపూర్వకంగా చేశారా లేక ఆవేశంలో జరిగిందా అనే కోణంలో విచారణ జరగనుంది. వివాదాల సంగతి పక్కన పెడితే, ఇదే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ ఒక అరుదైన రికార్డును చేరుకున్నారు. ముంబయి ఇండియన్స్‌పై ఐపీఎల్, ఛాంపియన్స్ లీగ్ కలిపి 1000 పరుగులు పూర్తి చేసిన తొలి బ్యాటర్‌గా కోహ్లీ రికార్డు సృష్టించారు. ఈ మ్యాచ్‌కు ముందు అతనికి 20 పరుగులు అవసరం కాగా, కేవలం 11 బంతుల్లోనే ఆ మార్కును చేరుకున్నారు. ప్రస్తుతం ముంబయిపై కోహ్లీ ఖాతాలో 1030 పరుగులు ఉన్నాయి. కేఎల్ రాహుల్ (977), శిఖర్ ధావన్ (901) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. తన ఫేవరెట్ టీమ్‌పై కోహ్లీ మరోసారి తన ఆధిపత్యాన్ని చాటుకున్నారు. మరోవైపు ఈ మ్యాచ్‌లో ఆర్సీబీ 18 పరుగుల తేడాతో విజయం సాధించి పాయింట్ల పట్టికలో మూడవ స్థానానికి చేరుకుంది. ఫిలిప్ సాల్ట్, విరాట్ కోహ్లీ, రజత్ పాటిదార్ అర్ధశతకాలతో రాణించడంతో ఆర్సీబీ 240 పరుగుల భారీ స్కోరు సాధించింది. ముంబయి ఆటగాళ్లు పోరాడినా లక్ష్యం పెద్దది కావడంతో ఓటమి తప్పలేదు. ఆర్సీబీకి ఇది మూడవ విజయం కావడం విశేషం.

## గ్రౌండ్ సిబ్బందికి రూ.25 లక్షల నగదు బహుమతి

**బలగం టీవీ, హైదరాబాద్**




అసోం క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) గువాహటిలోని తమ గ్రౌండ్ సిబ్బంది అవిశ్రాంత కృషిని సత్కరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురైనప్పటికీ, వారి కృషి వల్లే ఐపీఎల్ 2026కు సంబంధించిన మూడు షెడ్యూల్డ్ లీగ్ మ్యాచ్‌లు విజయవంతంగా నిర్వహించగలిగారని చెప్పింది. ఈ మేరకు ఆదివారం నాడు ఒక ప్రశంసనీయమైన చర్యగా, బర్సపారా స్టేడియంలోని గ్రౌండ్స్‌మెన్‌లకు క్రికెట్ బోర్డు రూ. 25 లక్షల నగదు బహుమతిని ప్రకటించింది. అసోం క్రికెట్ అసోసియేషన్, బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా, ఏసీఏ అధ్యక్షుడు తరంగ గొగోయ్ ఏసీఏ సోషల్ మీడియా హ్యాండిల్ 'ఎక్స్?'లో పోస్ట్ చేశారు. "గువాహటిలోని ఏసీఏ స్టేడియంలో మూడు ఇండియన్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను విజయవంతంగా నిర్వహించడం వెనుక, ప్రచారానికి దూరంగా ఉంటూ, అవిశ్రాంతంగా పనిచేసే ఒక బృందం ఉంది. అదే మా అంకితభావం గల గ్రౌండ్ సిబ్బంది" అని పేర్కొన్నారు. "ప్రతికూల వాతావరణ పరిస్థితుల మధ్య పనిచేస్తూ, క్యూరేటర్లు, గ్రౌండ్స్‌మెన్‌లు పిచ్‌లను అత్యున్నత ప్రమాణాలతో సిద్ధం చేసి, నిర్వహించేలా చూసుకున్నారు" అని తమ ప్రకటనలో పేర్కొన్నారు. "వారి కృషి మ్యాచ్‌లు సజావుగా జరగడంలో కీలక పాత్ర పోషించింది. అలాగే జాతీయ స్థాయిలో ఈ వేదికకు పెరుగుతున్న ఖ్యాతిని నిలబెట్టడంలో కూడా సహాయపడింది" అని ఆ ప్రకటనలో తెలిపారు. కాగా, వారి అమూల్యమైన సేవలకు గుర్తింపుగా, క్యూరేటర్, గ్రౌండ్స్‌మెన్‌లకు రూ.25 లక్షల రివార్డును ప్రకటించడానికి అసోం క్రికెట్ అసోసియేషన్ గర్విస్తోందని తెలిపింది. అసోసియేషన్ అధ్యక్షుడు తరంగ గొగోయ్, కార్యదర్శి సనాతన్ దాస్, జట్టు వృత్తి నైపుణ్యాన్ని, నిబద్ధతను ప్రశంసించారు. మ్యాచ్‌లు సజావుగా జరగడంలో వారి అంకితభావమే కీలకమని ఎక్స్? పోస్ట్?లో పేర్కొన్నారు. "మ్యాచ్ కార్యకలాపాలకు అసలైన వెన్నెముక మీరు. మీ కృషి వృథాగా పోదు" అని ట్వీట్? చేశారు. ఈ వేదికపై నిర్వహించిన మూడు మ్యాచ్‌లలో, రెండు మ్యాచ్‌లకు వర్షం అంతరాయం కలిగించింది. వర్షం కారణంగా రాజస్థాన్ రాయల్స్ , ముంబయి ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్?ను 11 ఓవర్లకు కుదించారు. ఇందులో రాజస్థాన్? విజయం సాధించింది. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన రాజస్థాన్ మ్యాచ్ ప్రారంభానికి కూడా వర్షం అంతరాయం కలిగించింది. ఫలితంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. కానీ ఒక్క ఓవర్ కూడా వృథా కాలేదు. వర్షం పడుతున్నప్పటికీ మ్యాచ్ జరిగేలా కృషి చేసినందుకు గానూ గ్రౌండ్స్‌మెన్‌లకు ఏసీఏ పురస్కారం అందజేసింది. ఐపీఎల్ 2026లో భాగంగా ముంబయి, రాజస్థాన్? మధ్య జరిగి మ్యాచ్?ను వర్షం కారణంగా 11 ఓవర్లకు కుదించారు. అయినప్పటికీ ఆటలో ఎక్కడా ఉత్కంఠ తగ్గలేదు. ముఖ్యంగా యువ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ చేసిన విధ్వంసకర బ్యాటింగ్ మ్యాచ్‌కే హైలైట్‌గా నిలిచింది. అలా రాజస్థాన్ అద్భుత ప్రదర్శనతో ముంబయి ఇండియన్స్‌పై 27 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది....

# ఉప్పల్‌లో ఉర్రూతలూగించిన మ్యాచ్.

- ఎస్ఆర్‌హెచ్ ఘన విజయం
- అరంగేట్రంలోనే హింగే సంచలనం...
- తొలి ఓవర్‌లో 3 వికెట్లు

**బలగం టీవీ, హైదరాబాద్**



ఉప్పల్ స్టేడియం వేదికగా సోమవారం జరిగిన ఐపీఎల్ పోరు అభిమానులను ఉర్రూతలూగించింది. సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్), రాజస్థాన్ రాయల్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ జట్టు అద్భుత విజయాన్ని నమోదు చేసింది.

217 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆరంభంలోనే కుదేలైంది. అరంగేట్రం చేసిన యువ పేసర్ ప్రఫుల్ హింగే తన తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసి



సంచలనం సృష్టించాడు. వైభవ్ సూర్యవంశీ, ధృవ్ జురెల్, ప్రిటోరియస్‌లను పెవిలియన్‌కు పంపి రాయల్స్ పతనానికి నాంది పలికాడు. ఐపీఎల్ చరిత్రలో తొలి ఓవర్‌లోనే మూడు వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా హింగే రికార్డు సృష్టించాడు.

ఇక మరో పేసర్ సకీబ్ హుస్సేన్ తన వేగం, స్వింగ్‌తో రాయల్స్ బ్యాటర్లను కట్టడి చేశాడు. ఇద్దరు కలిసి రాయల్స్‌ను కేవలం 9 పరుగులకే 5 వికెట్లు కోల్పోయేలా చేశారు. అనంతరం ఫెరీరా (69), జడేజా (45) పోరాటంతో రాయల్స్ పరువు నిలబెట్టుకున్నా, 19 ఓవర్లలో 159 పరుగులకు ఆలౌట్ అయింది.

అంతకుముందు బ్యాటింగ్ చేసిన హైదరాబాద్ జట్టు 20 ఓవర్లలో 216/6 స్కోరు చేసింది. ఇషాన్ కిషన్ 44 బంతుల్లో 91 పరుగులతో కెప్టెన్ ఇన్నింగ్స్ ఆడుతూ జట్టుకు భారీ స్కోరు అందించాడు. క్లాసెన్ (40)తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. ఆర్చర్ రెండు వికెట్లు తీసి రాణించాడు. బౌలింగ్‌లో నాలుగు వికెట్లు తీసిన ప్రఫుల్ హింగేకు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. అరంగేట్రంలోనే తన ప్రతిభతో అందరి దృష్టిని ఆకర్షించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

హైదరాబాద్: 20 ఓవర్లలో 216/6 (ఇషాన్ కిషన్ 91, క్లాసెన్ 40)

రాజస్థాన్: 19 ఓవర్లలో 159 ఆలౌట్ (ఫెరీరా 69, జడేజా 45, హింగే 4/34, సకీబ్ 4/24)

## మహిళల టీ20 వరల్డ్ కప్‌కు రికార్డ్ స్థాయిలో ప్రైజ్‌మనీ

**బలగం టీవీ, హైదరాబాద్**




మహిళల క్రికెట్ చరిత్రలో మరో అద్భుతమైన ఫైట్ జరగనుంది. కేవలం 60 రోజుల్లో ఇంగ్లాండ్, వేల్స్ వేదికలుగా ప్రారంభం కానున్న ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 కోసం అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (క్రీుజఙ) ఒక సంచలన నిర్ణయం తీసుకుంది. ఈసారి టోర్నీలో పాల్గొనే జట్ల కోసం రికార్డ్ స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. మహిళల క్రీడలకు ఆదరణ పెరుగుతున్న తరుణంలో, పురుషుల క్రికెట్‌తో సమానంగా పెట్టుబడులు పెట్టాలనే ఉద్దేశంతో ఐసీసీ ఈ అడుగు వేసింది. ప్రైజ్ మనీ పెంచడమే కాకుండా, టోర్నీని మరింత విస్తృతం చేస్తూ జట్ల సంఖ్యను కూడా పెంచడం విశేషం. ఈ నిర్ణయం మహిళా క్రికెటర్ల ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేయడమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఈ క్రీడకు కొత్త ఊపునివ్వబోతోంది. ఐసీసీ ప్రకటించిన వివరాల ప్రకారం, 2026 మహిళల టీ20 ప్రపంచకప్ మొత్తం ప్రైజ్ పూల్ విలువను 8,764,615 డాలర్లకు (సుమారు రూ. 73.4 కోట్లు) పెంచారు. ఇది 2024 ఎడిషన్‌తో పోలిస్తే 10 శాతం ఎక్కువ. గతంలో 10 దేశాలు పాల్గొన్న టోర్నీలో 7,958,077 డాలర్ల ప్రైజ్ మనీ ఉండేది. ఇప్పుడు జట్ల సంఖ్య 12కి పెరగడంతో బహుమతి మొత్తాన్ని కూడా ఐసీసీ భారీగా పెంచింది. క్రికెట్ రంగంలో మహిళా అథ్లెట్ల ప్రభావం పెరుగుతోందని, అందుకే పెట్టుబడులను కూడా అదే స్థాయిలో పెంచుతున్నామని ఐసీసీ సీఈఓ సంజోగ్ గుప్తా ఈ సందర్భంగా వెల్లడించారు. ఈ మెగా టోర్నీలో ట్రోఫీని ముద్దాడే జట్టుకు భారీ నగదు బహుమతి దక్కనుంది. విజేతగా నిలిచిన టీమ్ 2,340,000 డాలర్ల (సుమారు రూ. 19.5 కోట్లు) ప్రైజ్ మనీని సొంతం చేసుకుంటుంది. అలాగే రన్నరప్‌గా నిలిచిన జట్టుకు 1,170,000 డాలర్లు (సుమారు రూ. 9.7 కోట్లు) అందజేస్తారు. సెమీఫైనల్‌లో ఓడిపోయిన రెండు జట్లకు చెరో 675,000 డాలర్లు (సుమారు రూ. 5.6 కోట్లు) దక్కుతాయి. ప్రతి గ్రూప్ స్టేజ్ మ్యాచ్ గెలిస్తే అదనంగా 31,154 డాలర్లు (సుమారు రూ. 26 లక్షలు) ఇస్తారు. టోర్నీలో పాల్గొనే ప్రతి జట్టుకు కనీసం రూ. 2 కోట్ల ప్రైజ్ మనీని ఐసీసీ గ్యారెంటీ ఇచ్చింది. ఐసీసీ తీసుకుంటున్న ఇలాంటి నిర్ణయాలు మహిళా క్రికెట్ ఎదుగుదలకు ఎంతో అవసరం. ఆర్థికంగా బలోపేతం చేయడం ద్వారా మరికొంత మంది యువతులకు ఈ క్రీడ వైపు వచ్చేలా ప్రోత్సహించవచ్చు. మహిళల టీ20 ప్రపంచకప్ చరిత్రలో మొదటిసారిగా 12 జట్లు తలపడబోతున్నాయి. గతంలో కేవలం 10 జట్లు మాత్రమే మెగా టోర్నీలో పోటీ పడేవి. జట్ల సంఖ్య పెరగడం వల్ల టోర్నీ మరింత రసవత్తరంగా మారనుంది. ఆతిథ్య దేశం ఇంగ్లాండ్‌తో పాటు శ్రీలంక, ఆస్ట్రేలియా, బంగ్లాదేశ్, ఇండియా, ఐర్లాండ్, నెదర్లాండ్స్, న్యూజిలాండ్, పాకిస్థాన్, స్కాట్లాండ్, దక్షిణాఫ్రికా అలాగే వెస్టిండీస్ జట్లు ఈ పోరులో నిలవనున్నాయి. మొత్తం 24 రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో 7 వేదికల్లో 33 మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఇది మహిళల క్రికెట్‌ను మరింత గ్లోబల్ స్పోర్ట్‌గా మార్చడానికి దోహదపడుతుందని ఐసీసీ భావిస్తోంది. వరల్డ్ కప్ ప్రైజ్ మనీ ప్రకటనతో పాటే ఐసీసీ ట్రోఫీ టూర్ కూడా వైభవంగా మొదలైంది. లండన్‌లోని చారిత్రాత్మక లార్డ్స్ క్రికెట్ గ్రౌండ్ వేదికగా ఈ టూర్ ప్రారంభమైంది. మొదటిసారిగా లార్డ్స్ పెవిలియన్‌పై ట్రోఫీ ఆకారాన్ని ప్రొజెక్ట్ చేసి సరికొత్తగా ఆవిష్కరించారు. ఈ ట్రోఫీ నెదర్లాండ్స్, ఐర్లాండ్, స్కాట్లాండ్ వంటి దేశాల్లో పర్యటించి, ఆ తర్వాత మే నెలలో ఇంగ్లాండ్‌లోని వివిధ నగరాల్లో తిరుగుతుంది. మాంచెస్టర్, బర్మింగ్‌హామ్, బ్రిస్టల్ వంటి ప్రధాన నగరాల్లో అభిమానులకు ఈ ట్రోఫీని చూసే అవకాశం కల్పిస్తారు. ఇది టోర్నీపై ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచడానికి సహాయపడుతుంది.ఈ మెగా టోర్నీ జూన్ 12న బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఇంగ్లాండ్, శ్రీలంకతో తలపడనుంది. గ్రూప్ దశలో భారత్, ఆస్ట్రేలియా వంటి బలమైన జట్ల మధ్య జరిగే పోరు కోసం అభిమానులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. టోర్నీ ఆరంభానికి కేవలం రెండు నెలల సమయం మాత్రమే ఉండటంతో జట్లన్నీ ఇప్పటికే గట్టిగా సిద్ధమవుతున్నాయి. గత 2024 వరల్డ్ కప్ టోర్నీలో న్యూజిలాండ్ ట్రోఫీని గెలుచుకుంది. మరి ఈ సారి ఎవరు గెలుస్తారో చూడాలి.

## టీ20లో విరాట్ కోహ్లీ రికార్డ్



**బలగం టీవీ, హైదరాబాద్**


విరాట్ కోహ్లీ ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు. వాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరఫున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్. ముంబై: రన్ మెషిన్ విరాట్ కోహ్లీ 2026లో రికార్డులు సృష్టిస్తున్నాడు. ముంబై ఇండియన్స్ జట్టుపై ముంబై వేదికగా ఆడుతూ అరుదైన ఘనత సాధించాడు. ముంబై ఇండియన్స్ పై వెయ్యి పరుగులు చేసిన మొదటి క్రికెటర్‌గా కోహ్లీ చరిత్రలో నిలిచాడు. ఛాంపియన్స్ లీగ్ టీ20, ఇండియన్ ప్రీమియర్ లీగ్ రెండింటిలోనూ కలిపి ముంబై జట్టుపై కింగ్ కోహ్లీ వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. ఈ ఘనత సాధించిన ఏకైక క్రికెటర్‌గా నిలిచాడు

వాంఖడే మైదానంలో ఆదివారం రాత్రి జరుగుతున్న మ్యాచ్‌లో 20 పరుగులు చేయడంతో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. ఈ విషయంలో అతను భారత బ్యాటర్లు కేఎల్ రాహుల్, శిఖర్ ధావన్‌లను అధిగమించాడు. ఈ జాబితాలో ఏబీ డివిలియర్స్, డేవిడ్ వార్నర్ ఎక్కువ దూరంలో లేరు. విరాట్ రికార్డు మాత్రం చారిత్రాత్మకమైనది. ఎందుకంటే అతను ఒకే జట్టు తరఫున ఆడుతూ ప్రత్యర్థి జట్టుపై ఏకంగా వెయ్యి పరుగులు పూర్తి చేశాడు. కేఎల్ రాహుల్ ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు చేయడానికి కేవలం 23 పరుగుల చేరువలో ఉన్నాడు. అయితే కోహ్లీ మాత్రం ఒకే జట్టుకు ఆడుతూ ఈ ఫీట్ నమోదు చేసిన ఏకైక క్రికెటర్.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ చరిత్రలో విరాట్ కోహ్లీ 4 వేర్వేరు జట్లపై వెయ్యికి పైగా పరుగులు చేశాడు. కోహ్లీ చెన్నై సూపర్ కింగ్స్‌పై 1174 పరుగులు చేయగా, పంజాబ్ కింగ్స్‌పై 1159 పరుగులు చేశాడు. కోల్‌కతా నైట్ రైడర్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌పై కూడా వెయ్యికి పైగా పరుగులు చేసి సరికొత్త రికార్డులు నమోదు చేస్తున్నాడు. ముంబై ఇండియన్స్‌తో ఆదివారం జరుగుతున్న మ్యాచ్‌కు ముందు విరాట్ కోహ్లీ ముంబై ఇండియన్స్‌పై 922 పరుగులు చేశాడు. ఇతర టోర్నీలలోనూ ముంబైపై పరుగులు చేశాడని తెలిసిందే. ముంబైకి వ్యతిరేకంగా వెయ్యి పరుగులు పూర్తి చేయడానికి ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 78 పరుగులు చేయాల్సి ఉంది. చరిత్రలో 8 వేలు లేదా అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన ఏకైక బ్యాటర్ కోహ్లీనే.

## కొత్త వివాదంలో చిక్కుకున్న యుజ్వేంద్ర చాహల్

**బలగం టీవీ, హైదరాబాద్**



టీమిండియా లెగ్ స్పిన్నర్, ప్రస్తుతం పంజాబ్ కింగ్స్ తరఫున ఐపీఎల్ 2026లో ఆడుతున్న యుజ్వేంద్ర చాహల్ ఓ కొత్త వివాదంలో చిక్కుకున్నాడు. బోల్డ్ నటిగా పేరు తెచ్చుకున్న తానియా ఛటర్జీ.. చాహల్ తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో పర్సనల్ మెసేజ్ పంపాడంటూ సంచలన ఆరోపణలు చేసింది. దీనికి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఈ వీడియోలో ఆమె తన ఫోన్‌ను మీడియా ప్రతినిధులకు చూపిస్తూ.. చాహల్ తన ఫోటోకు స్పందిస్తూ .."ఆప్ క్యూట్ హో" (మీరు చాలా క్యూట్‌గా ఉన్నారు) అని మెసేజ్ చేసినట్లు పేర్కొంది. ఉల్లు, గందీ బాత్ వంటి ఓటీటీ సిరీస్‌ల ద్వారా పాపులర్ అయిన తానియా ఛటర్జీ.. ఈ విషయాన్ని కెమెరాల ముందు బయటపెట్టారు. చాహల్ పంపిన మెసేజ్ ను తాను చాలా ఆలస్యంగా చూశానని.. అందుకే చాహల్‌కు రిప్లై ఇవ్వదని తానియా వివరించారు. ఈ సమయంలో కెమెరామెన్లు ఆమెను ఆటపట్టిస్తుండగా.. తానియా సిగ్గుపడుతూ కనిపించారు. అయితే ఈ ఆరోపణలపై యుజ్వేంద్ర చాహల్ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.ఈ వార్త బయటకు రాగానే నెటిజన్లు రెండు వర్గాలుగా విడిపోయి కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. కొందరు యుజ్వేంద్ర చాహల్ ప్రవర్తనను తప్పుబడుతూ విమర్శలు గుప్పిస్తుంటే.. మరికొందరు మాత్రం ఇది కేవలం పబ్లిసిటీ కోసమే చేస్తున్న చౌకబారు పని అని కొట్టిపారేస్తున్నారు. ప్రస్తుతం ఏఐ కాలంలో ఇలాంటి ఫేక్ చాట్‌లు సృష్టించడం పెద్ద కష్టమేమీ కాదని.. వార్తల్లో నిలవడానికి నటి ఇలాంటి పనులు చేస్తోందని చాహల్ అభిమానులు మండిపడుతున్నారు. గతంలో ధనశ్రీ వర్మతో విడిపోయిన తర్వాత యుజ్వేంద్ర చాహల్ వ్యక్తిగత జీవితం తరచుగా వార్తల్లో నిలుస్తూనే ఉంది.వ్యక్తిగత జీవితంలో వివాదాలు ఉన్నప్పటికీ.. మైదానంలో యుజ్వేంద్ర చాహల్ పంజాబ్ కింగ్స్ తరఫున కీలక పాత్ర పోషిస్తున్నారు. ఐపీఎల్ చరిత్రలోనే అత్యధిక వికెట్లు(224) తీసిన బౌలర్‌గా రికార్డు సృష్టించిన యుజ్వేంద్ర చాహల్‌ను పంజాబ్ కింగ్స్ రూ.18 కోట్లకు రీటైన్ చేసుకుంది. శ్రేయస్ అయ్యర్ సారథ్యంలో పంజాబ్ జట్టు ఈ సీజన్లో అద్భుతంగా రాణిస్తూ పాయింట్ల పట్టికలో రెండో స్థానంలో ఉంది. తన తదుపరి మ్యాచ్‌లో భాగంగా ఏప్రిల్ 16న వాంఖడే స్టేడియంలో పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్టుతో తలపడనుంది.

## కెప్టెన్సీ నాకు కొత్త కాదు: ఇషాన్ కిషన్

**బలగం టీవీ, హైదరాబాద్**



కెప్టెన్సీ తనకు కొత్త కాదని సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ అన్నాడు. అండర్ 19 స్థాయి నుంచి తాను కెప్టెన్సీ చేస్తున్నానని గుర్తు చేశాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా రాజస్థాన్ రాయల్స్‌తో ఉప్పల్ వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. టాస్ సందర్భంగా మాట్లాడిన ఇషాన్ కిషన్ తుది జట్టులో రెండు మార్పులు చేసినట్లు వెల్లడించాడు. 'మా తుది జట్టులో రెండు మార్పులు చేశాం. ప్రఫుల్ హింగే జట్టులోకి వచ్చాడు. నేను చాలా కాలంగా కెప్టెన్సీ బాధ్యతలు నిర్వహిస్తున్నాను. గతంలో భారత అండర్-19 జట్టుతో పాటు నా రాష్ట్ర జట్టుకు కూడా కెప్టెన్‌గా వ్యవహరించాను. సారథ్యం ఆట పట్ల మరింత ఏకాగ్రతతో ఉంచడంతో పాటు పరిస్థితులపై మంచి అవగాహన ఉండేలా చేస్తుంది. కెప్టెన్సీ అనేది వ్యక్తిగత ప్రదర్శన కంటే జట్టు ప్రదర్శనకే ప్రాధాన్యతనిస్తుంది. జట్టు కోసం మరిన్ని విజయాలు సాధించడానికి మేం సిద్ధంగా ఉన్నాం. కెప్టెన్‌గా ఉంటూ జట్టు కోసం బాగా రాణిస్తే అది ఆటగాడి పరిణతిని చూపిస్తుంది. గత కొన్నేళ్లుగా సారథిగా నా ప్రదర్శన నేను మళ్ళీ భారత జట్టులోకి పునరాగమనం చేసేందుకు సహాయపడింది.'అని ఇషాన్ కిషన్ పేర్కొన్నాడు.మరోవైపు టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ బౌలింగ్ ఎంచుకుంది. పిచ్ కండిషన్స్ నేపథ్యంలోనే ఈ నిర్ణయం తీసుకున్నానని రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ తెలిపాడు. 'మేం ముందుగా బౌలింగ్ చేస్తాం. ఇది మాకు కొత్త వికెట్. ఇది కొత్త వికెట్. ఇప్పటి వరకు వాడని పిచ్. కాబట్టి ఆరంభంలో కాస్త నెమ్మదిగా ఉండే అవకాశం ఉంది. ఈ మైదానంలో మేం చాలా సార్లు లక్ష్యాలను ఛేదించాం. 2024లో తృటిలో ప్లే ఆఫ్స్ అవకాశం కోల్పోయాం. ఈసారి అలా జరగకూడదని కోరుకుంటున్నాం. తుది జట్టులో రెండు మార్పుల ఉన్నాయి. బ్రిజేష్ స్థానంలో తుషార్ దేశ్‌పాండే వచ్చాడు. హెట్మెయర్‌కు విశ్రాంతి ఇచ్చి, ప్రిటోరియస్‌కు అవకాశం ఇస్తున్నాం. ఇక్కడి వరకు రావడం ఒక ప్రయాణంలా అనిపిస్తోంది. నేను చాలా కాలం సంజూ శాంసన్ భయ్యా ఆధ్వర్యంలో ఆడాను. ఆ తర్వాత సంగక్కర వ్యూహాత్మక విషయాల్లో నన్ను భాగస్వామిని చేస్తూ నా ఆటను మెరుగుపరిచారు. ఇప్పుడు ఆ బాధ్యతను నేను తీసుకున్నాను. కొన్ని కఠినమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వచ్చినా.. ఇక్కడ ఉండటం సంతోషంగా ఉంది.'అని రియాన్ పరాగ్ తెలిపాడు.

balagamtv100@gmail.com

# కండలు పెంచి.. కొత్త లుక్‌లో ఎన్టీఆర్



## డ్రాగన్ కోసం ఎన్టీఆర్ కసరత్తులు

జూనియర్ ఎన్టీఆర్ , స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న డ్రాగన్‌పై అంచనాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్ న్యూ లుక్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేసింది. తాజాగా బయటకు వచ్చిన లుక్‌లో ఎన్టీఆర్ కండలు తిరిగిన దేహంతో, బీస్ట్ మోడ్‌లో కనిపిస్తున్నారు. సన్నని నడుముతో క్లాసిక్ బ్యాక్ డబుల్ బైసెప్స్ పోజ్‌లో ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవర్‌ఫుల్ యాక్షన్ పాత్ర కోసం ఎన్టీఆర్ కఠినమైన ట్రైనింగ్, ప్రత్యేక డైట్‌ను ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. జిమ్‌లో ప్రాక్టీస్ చేస్తున్న ఫోటోను షేర్ చేస్తూ ఇది కష్టపడి తెచ్చుకున్న కండలు..కొన్నవి కావు.. అని ఆయన రాసిన క్యాప్షన్ కూడా వైరల్ అవుతోంది. ఇటీవల ఎన్టీఆర్ లుక్‌పై కొంత అసంతృప్తి ఏర్పడిందని, దాని వలన షూటింగ్ నిలిచిపోయిందంటూ ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. అయితే దీనిపై చిత్ర నిర్మాతలు స్పష్టత ఇచ్చారు. ఆ వార్తల్లో ఎలాంటి నిజం లేదని, ఇది కేవలం రెగ్యులర్ షెడ్యూల్ బ్రేక్ మాత్రమేనని తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ అనుకున్న ప్రణాళిక ప్రకారమే కొనసాగుతోందని పేర్కొన్నారు. ఇప్పటికే జోర్డాన్‌లో ఒక షెడ్యూల్ పూర్తయినట్లు సమాచారం. అలాగే హైదరాబాద్ సమీపంలోని శంషాబాద్ ప్రాంతంలో కూడా కీలక సన్నివేశాలు చిత్రీకరించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా ఎన్టీఆర్‌పై యాక్షన్ సీక్వెన్స్‌లను చిత్రీకరించారని సమాచారం. తదుపరి షెడ్యూల్ కోసం భారీ సెట్స్ నిర్మాణం జరుగుతోంది. ఈ సినిమాలో విలన్ పాత్రపై కూడా ఆసక్తికర చర్చ నడుస్తోంది. తొలుత మలయాళ నటుడు టోవినో థామస్ ఈ పాత్రలో నటిస్తారని ప్రచారం జరిగింది. కానీ డేట్స్ సమస్యల కారణంగా ఆయన ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం ఈ కీలక పాత్ర కోసం బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్‌ని సంప్రదించే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు ఇండస్ట్రీ టాక్ వినిపిస్తోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో హీరోయిన్‌గా రుక్మిణి వసంత్ నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ త్వరలో రానున్నాయి. జూన్ 25న విడుదల చేయాలనే ప్రణాళికలో ఉన్నట్లు సమాచారం.

# భరతవర్ష్ మూవీతో వస్తోన్న గోపీచంద్



యాక్షన్ హీరో గోపీచంద్ మరో భారీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. వరుస ఫ్లాప్స్ తర్వాత సాలిడ్ హిట్ కోసం ఎదురుచూస్తున్న ఆయన ఈసారి పూర్తిగా భిన్నమైన కథతో 'భరతవర్ష' అనే పవర్‌ఫుల్ టైటిల్‌తో కొత్త సినిమాను ప్రకటించారు. టైటిల్ గ్లింప్స్ విడుదలయ్యాక సినిమా పై ఒక్కసారిగా భారీ అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా విడుదలైన గ్లింప్స్ వీడియోలో గోపీచంద్ యోధుడిగా కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. శత్రువులను ధైర్యంగా ఎదుర్కొంటూ యుద్ధరంగంలో విరుచుకుపడే సన్నివేశాలు గూస్‌బంప్స్ తెప్పించేలా ఉన్నాయి. విజువల్స్, బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్, యాక్షన్ ఎలిమెంట్స్ అన్నీ కలిసి సినిమా గ్రాండ్‌గా ఉండబోతుందనే సంకేతాలు ఇస్తున్నాయి. 'భరతవర్ష' అనే టైటిల్‌కు కూడా ప్రత్యేకమైన అర్థం ఉంది. పురాణాల ప్రకారం భరతవర్షం అంటే హిమాలయాల నుంచి సముద్రం వరకు విస్తరించిన అఖండ భారతదేశాన్ని సూచిస్తుంది. చక్రవర్తి భరతుడి పేరుమీదుగా ఈ పేరు వచ్చినట్లు చరిత్ర చెబుతుంది. ఈ నేపథ్యంలో సినిమా దేశభక్తి, చరిత్ర, మైథాలజీ అంశాలను మేళవించి రూపొందుతున్నట్టు తెలుస్తోంది. ఇండిపెండెన్స్‌కు ముందు జరిగే పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్లు ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కథలో మైథాలజీ టచ్ కూడా ఉండే అవకాశం ఉందని సమాచారం. ఈ కలయికతో సినిమా మరింత ఆసక్తికరంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చిత్రంలో గోపీచంద్ సరసన రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆమె పాత్ర కూడా కథలో కీలకంగా ఉండబోతుందట. టెక్నికల్‌గా హై స్టాండర్డ్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నారని, మేకర్స్ ఎక్కడా రాజీ పడటం లేదని తెలుస్తోంది. గోపీచంద్ కెరీర్‌లో ఇది ఒక టర్నింగ్ పాయింట్ మూవీ అవుతుందా అనే ఆసక్తి అభిమానుల్లో నెలకొంది. ఇప్పటివరకు వచ్చిన గ్లింప్స్, టైటిల్ ప్రభావం చూస్తే 'భరతవర్ష'తో ఆయన బలమైన కంబ్యాక్ ఇవ్వడం ఖాయం అన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సినిమా విడుదల తేదీపై త్వరలోనే అధికారిక ప్రకటన వచ్చే అవకాశం ఉంది.




# బాలకృష్ణ, గోపీచంద్ కాంబో




## థమన్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఫిక్స్

నటసింహం నందమూరి బాలకృష్ణ మరియు మాస్ డైరెక్టర్ గోపీచంద్ మలినేని కలయికలో తెరకెక్కుతున్న తాజా చిత్రంపై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే అనౌన్స్‌మెంట్‌తోనే హైప్ క్రియేట్ చేసిన ఈ ప్రాజెక్ట్ ఇప్పుడు మ్యూజిక్ పనులతో మరో అడుగు వేసింది. ఈ సినిమాకు సంగీత దర్శకుడు ఎస్.ఎస్. థమన్ ఇప్పటికే మ్యూజిక్ సిట్టింగ్స్ ప్రారంభించారు. తాజా సమాచారం ప్రకారం, రెండు ట్యూన్స్‌ను పూర్తిచేసిన థమన్, వాటిలో ఒక సాంగ్‌కి ప్రముఖ లిరిసిస్ట్ అనంత్ శ్రీరామ్‌తో పాట రాయించినట్టు తెలుస్తుంది. ఈ సాంగ్‌ను హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో గ్రాండ్‌గా చిత్రీకరించేందుకు ఎ÷-లాన్ చేస్తున్నారు. ఈ సాంగ్ షూట్ పూర్తయ్యిన వెంటనే అక్కడే ఒక కీలక యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా చిత్రీకరించనున్నట్లు సమాచారం. భారీ సెట్స్, విజువల్ గ్రాండియర్‌తో ఈ సన్నివేశాలు సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. ఈ సినిమాకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో బాలకృష్ణను ఒక రాజుగా చూపించగా, హీరోయిన్‌గా నయనతార మహారాణి పాత్రలో కనిపించనున్నట్లు సంకేతాలు ఇచ్చారు. దీంతో ఇది ఒక పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు స్పష్టమవుతోంది. ఇప్పటికే బాలయ్య?నయనతార కాంబినేషన్ ప్రేక్షకులను పలుమార్లు మెప్పించింది. వీరిద్దరూ కలిసి నటించిన సింహా, శ్రీరామ రాజ్యం, జై సింహా చిత్రాలు మంచి విజయాలను అందుకున్నాయి. ఇప్పుడు మరోసారి ఈ జోడీ తెరపై కనిపించనుండటంతో అభిమానుల్లో ఆసక్తి మరింత పెరిగింది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను నిర్మాత సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కథ, సెట్స్, యాక్షన్ సన్నివేశాలు ప్రత్యేకంగా ఉండబోతున్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తానికి, బాలయ్య-గోపీచంద్ మలినేని కాంబోలో వస్తున్న ఈ పీరియాడిక్ మూవీపై రోజురోజుకూ అంచనాలు పెరుగుతుండగా, త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి.

# జననాయగన్'ను పైరసీ వ్యవహారం

## ఆరుగురిని అరెస్ట్ చేసిన సైబర్ క్రైమ్ పోలీసులు




కోలీవుడ్ అగ్రకథానాయకుడు విజయ్ నటించిన చివరి చిత్రం 'జననాయగన్'ను పైరసీ భూతం వేధిస్తోన్న విషయం తెలిసిందే. విడుదలకు ముందే ఈ సినిమా ఆన్‌లైన్‌లో లీక్ కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చిత్రబృందం ఫిర్యాదుతో సైబర్ క్రైమ్ పోలీసులు రంగంలోకి దిగారు. ఆరుగురుని అరెస్ట్ చేశారు. దీనిపై చిత్రబృందం తరపు లాయర్ పోస్ట్ పెట్టారు సినిమాను లీక్ చేసినందుకు సైబర్ క్రైమ్ విభాగం ఇప్పటికే ఆరుగురిని అరెస్టు చేసింది. సోషల్ మీడియా వేదికగా లీకైన సీన్‌లను ఏ రూపంలోనైనా డౌన్‌లోడ్ చేసినా, షేర్ చేసినా వారిపై కూడా చర్యలు తీసుకుంటాం. పైరసీని ఫార్వర్డ్ చేసిన వ్యక్తులను కూడా గుర్తించి తక్షణమే కఠిన చర్యలు తీసుకుంటాం అని నోటీసులు విడుదల చేశారు. కొన్ని డిజిటల్ పరికరాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పైరసీని షేర్ చేస్తోన్న 300 సోషల్ మీడియా లింక్‌లను తొలగించినట్లు అధికారులు వెల్లడించారు. విజయ్ చివరి చిత్రం కావడంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. సెన్సార్ సర్టిఫికెట్ పక్రియలో జాప్యం కారణంగా విడుదలపై క్లారిటీ రావడం లేదు. ఈ తరుణంలో సినిమా లీక్ కావడంపై మూవీ టీమ్‌తో పాటు ఇండస్ట్రీ మొత్తం ఆందోళన వ్యక్తం చేస్తోంది. చిరంజీవి,కమల్‌హాసన్, రజనీకాంత్ వంటి అగ్రతారలు విజయ్‌కు మద్దతుగా నిలిచారు.

# ఏ పర్ఫెక్ట్ మ్యాచ్ సీరిస్

## ఆకట్టుకుంటున్న సారా అర్జున్ -ఇషాన్ ఖట్టర్

ప్రస్తుతం సోషల్ మీడియా మొత్తం ఒకే జంట గురించి చర్చించుకుంటోంది. అదే సారా అర్జున్ -ఇషాన్ ఖట్టర్. వీరిద్దరూ కలిసి నటించిన మైక్రో సిరీస్ 'ఏ పర్ఫెక్ట్ మ్యాచ్' ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటూ ట్రెండింగ్‌లో దూసుకుపోతోంది. కేవలం కొన్ని ఎపిసోడ్లతోనే ఈ జంట ఇంటర్నెట్‌లో మోస్ట్ ఫేవరెట్ జోడీగా మారిపోవడం విశేషం. ప్రముఖ దర్శకురాలు జోయా అక్తర్ సహకారంతో రూపొందిన ఈ సిరీస్‌లో ప్రేమకథను ఒక కొత్త కోణంలో చూపించారు. నిత్యజీవితంలో ఎదురయ్యే చిన్న చిన్న సంఘటనలను సెర్చ్ ఇంజిన్ కాన్సెప్ట్‌తో మేళవిస్తూ కథను నడిపించడం ఈ సిరీస్ ప్రత్యేకత. ఇప్పటివరకు విడుదలైన ఎపిసోడ్లు మంచి స్పందనను రాబట్టగా? ప్రతి ఎపిసోడ్‌తో ప్రేక్షకుల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. ముఖ్యంగా సారా -ఇషాన్ మధ్య ఉన్న నేచురల్ కెమిస్ట్రీ ఈ సిరీస్‌కు ప్రధాన బలం. సాధారణంగా కనిపించే మాస్ లేదా క్లిష్టమైన పాత్రల కంటే వీరి మధ్య ఉన్న ఫ్రెష్ వైబ్ ప్రేక్షకులను బాగా కనెక్ట్ చేస్తోంది. వారి సంభాషణలు, భావోద్వేగాలు చాలా సహజంగా ఉండటంతో యూత్‌లో ఈ జంటకు మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక నెటిజన్లు అయితే ఈ జంటను పెద్ద తెరపై కూడా చూడాలని డిమాండ్ చేస్తున్నారు. ఇద్దరూ కలిసి ఫుల్ లెంగ్త్ సినిమా చేస్తే బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ ఖాయం అంటూ కామెంట్లు చేస్తున్నారు. రొటీన్ జంటలతో పోలిస్తే వీరిద్దరి మధ్య ఉన్న అనుబంధం కొత్త తరహాలో ఉండటం కూడా ఈ క్రేజ్‌కు కారణంగా మారింది.ఇటీవల సారా అర్జున్ నటించిన 'ధురంధర్', ఇషాన్ ఖట్టర్ నటించిన 'హోమ్‌బౌండ్' సినిమాలు కూడా మంచి ప్రశంసలు అందుకోవడంతో ఈ ఇద్దరూ నవతరం నటులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఇప్పుడు ఒకే ప్రాజెక్ట్‌లో కనిపించడం సినీ ప్రియులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది.

# సమ్మర్‌లో మూడు కొత్త సినిమాలు




ఈ వేసవి వేడిలో ప్రేక్షకులకు కూల్ ఎంటర్‌టైన్‌మెంట్ అందించేందుకు టాలీవుడ్‌లో చిన్న సినిమాలు సిద్ధమవుతున్నాయి. విలేజ్ కామెడీ ఎంటర్‌టైనర్స్ నుంచి ప్రేమ కథల వరకు విభిన్న జానర్లతో థియేటర్లలో సందడి చేసేందుకు కొన్ని ఆసక్తికర చిత్రాలు ఏప్రిల్ మూడో వారంలో విడుదలకు రెడీ అయ్యాయి.యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నిర్మాతగా పరిచయం అవుతున్న తొలి చిత్రం తిమ్మరాజుపల్లి టివి. 90ల నాటి నేపథ్యంలో రూపొందిన ఈ విలేజ్ కామెడీ ఎంట్టంల్గ÷నర్ అప్పటి జీవనశైలిని, గ్రామీణ వాతావరణాన్ని గుర్తు చేసేలా ఉండబోతోంది. కొత్త ప్రతిభను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో దాదాపు కొత్త నటీనటులతో ఈ సినిమాను తెరకెక్కించారు. సాయితేజ్, వేద జలంధర్ హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతుం డగా, దర్శకుడు వి. మునిరాజు ఈ చిత్రాన్ని తెరకెక్కిం చారు. ఈ సినిమా ఏప్రిల్ 17న ప్రేక్షకుల ముందుకు రానుం ది. విభిన్న కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న హీరో తిరువీర్ నటిస్తున్న తాజా చిత్రం పాపం ప్రతాప్. ఈ సినిమాలో పాయల్ రాధాకృష్ణ హీరోయిన్‌గా నటిస్తున్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట జీవితంలో కేవలం నాలుగు రోజుల్లోనే ఎదురయ్యే సమస్యల చుట్టూ కథ తిరుగుతుందని సమాచారం. దర్శకుడు ఎస్పీ దుర్గా నరేశ్ తెరకెక్కించిన ఈ చిత్రంలో అజయ్ ఘోష్, రఘుబాబు, ప్రసాద్ బెహర వంటి నటులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా కూడా ఏప్రిల్ 17న విడుదల కానుంది. యువ హీరో నాగశౌర్య నటించిన 'బ్యాడ్ బాయ్ కార్తీక్' చిత్రం ఈ వారం ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు రామ్ దేశినా తెరకెక్కించిన ఈ యూత్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో హీరోయిన్‌గా విధి నటించింది. దాదాపు మూడు సంవత్సరాలుగా నిర్మాణంలో ఉన్న ఈ సినిమా చివరికి విడుదలకు సిద్ధమైంది. ఏప్రిల్ 17న థియేటర్లలో రిలీజ్ కానుండగా, యూత్ ఆడియన్స్‌ను ఆకట్టుకునే అంశాలతో రూపొందిన ఈ మూవీపై మంచి అంచనాలు ఉన్నాయి. ఇదే రోజున 'తెరచాప' అనే మరో చిన్న సినిమా కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రస్తుతం పెద్ద సినిమాల మధ్య చిన్న సినిమాలకు అవకాశాలు తగ్గుతున్నప్పటికీ, మంచి కథ, సహజమైన నటన ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని మేకర్స్ నమ్ముతున్నారు. ముఖ్యంగా ఫ్యామిలీ ఆడియన్స్, యూత్‌ను టా÷-గ్గ÷ట్ చేస్తూ ఈ సినిమాలు తెరకెక్కడం విశేషం. ఏప్రిల్ మూడో వారం థియేటర్లలో చిన్న సినిమాల సందడి మొదలవుతుండగా, వీటిలోఏ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకుంటుందో చూడాలి.

# రణబాలి సెట్స్‌లోకి అడుగుపెట్టిన




## విజయ్ దేవరకొండ, రష్మిక

'రణబాలి' చిత్రంతో జంటగా ప్రేక్షకుల్ని అలరించనున్నారు విజయ్ దేవరకొండ - రష్మిక. వీళ్లిద్దరూ కలిసి నటిస్తున్న ఈ సినిమాని రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉన్న ఈ సినిమా కోసం విజయ్ - రష్మిక తిరిగి సెట్‌లోకి అడుగు పెట్టారు. ఈ ఇద్దరూ వైవాహిక బంధంలోకి అడుగు పెట్టాక కలిసి సెట్‌లోకి రావడం ఇదే తొలిసారి కావడంతో చిత్ర బృందం వారికి స్వాగతం పలికి.. కేక్ కట్ చేయించింది. 1854 - 1978 మధ్య బ్రిటిష్ పాలనా కాలంలో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని ముస్తాబు చేస్తున్నారు. విజయ్ దీంట్లో టైటిల్ పాత్ర పోషిస్తుండగా.. ఆయన భార్య జయమ్మ పాత్రలో రష్మిక నటిస్తోంది. ఈ సినిమా సెప్టెంబరు 11న థియేటర్లలోకి రానుంది. ఈ చిత్రానికి సంగీతం: అజయ్ - అతుల్, ఛాయాగ్రహణం: నీరవ్ షా.